బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ శుక్రవారం 25, సెప్టెంబర్-2026
balagamtv100@gmail.com
పేజీలు-8

ప్రభుత్వ వైద్య సేవలు విస్తృతంగా అందించాలి



# 22ఏ సమస్యలకు ఫాస్ట్‌ట్రాక్ పరిష్కారం

- జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, మున్సిపాల్టీల్లోని ప్రజలకు ఉపశమనం
- ఇండ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం
- ఉత్తర్వులు జారీ చేశాం :
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి



హైదరాబాద్, సెప్టెంబర్ 24 : దశాబ్దాలుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న 22ఏ సమస్యలకు ఒక్కొక్కటిగా పరిష్కారం చూపుతూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 16న శాసనసభలో ఇచ్చిన హామీ మేరకు సహచర మంత్రులతో చర్చించి 22ఏ సమస్యలను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరించే దిశగా ప్రభుత్వం ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించిందని పేర్కొన్నారు. ఈ మేరకు మంత్రి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 22ఏలో ఉన్నప్పటికీ సంబంధిత ప్రభుత్వ సంస్థల నుంచి చట్టబద్ధమైన అనుమతులు పొంది అభివృద్ధి చేసిన ఓపెన్ ప్లాట్లు, ఇండ్లు, ఫ్లాట్లకు నిర్దేశిత నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం కల్పిస్తూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని వివరించారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, మున్సిపాల్టీలు, డీటీసీపీ లేదా ఇతర పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల నుంచి చెల్లుబాటు అయ్యే లేఅవుట్, భవన నిర్మాణం లేదా అపార్ట్‌మెంట్ అనుమతులు పొందిన ఆస్తులకు ఈ నిర్ణయం వర్తిస్తుందని తెలిపారు. అనుమతి పొందిన అనంతరం జరిగిన రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఏదో ఒక లింక్ డాక్యుమెంట్ తప్పనిసరిగా దరఖాస్తుదారులు సమర్పించాల్సి ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు.

**జిల్లా స్థాయిలో సమస్యల పరిష్కారానికి కమిటీ**

ఈ ప్రక్రియలో ఏవైనా సమస్యలు తలెత్తితే వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్టు మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఈ కమిటీలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా రిజిస్ట్రార్, హెచ్ఎండీఏ/పురపాలక సంస్థ/గ్రామీణ స్థానిక మిగతా 3లో..

# దానం నాగేందర్ ఔట్!..



- ఫిరాయింపు ఎమ్మెల్యేకు సుప్రీంకోర్టులోనూ ఎదురుదెబ్బ

హైదరాబాద్, సెప్టెంబర్ 24 : బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి జంప్ అయిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు చివరి ఆశ కూడా అడియాశే అయ్యింది. పార్టీ ఫిరాయింపుల కేసులో ఆయనకు సుప్రీం కోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఎమ్మెల్యేగా ఆయనను అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు 18న వెలువరించిన తీర్పును సవాల్ చేస్తూ, దాఖలు చేసిన ఎస్ఎల్‌పీని భారత అత్యున్నత న్యాయ స్థానమైన కొట్టివేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జాయ్ మాల్యబాగ్చీ, జస్టిస్‌వీ మోహనతో కూడినత్రిసభ్య మిగతా 3లో..

# రాహుల్, రేవంత్‌కు సుప్రీం తీర్పు చెంపపెట్టు

- దానం అనర్హతతో ఒక వికెట్ ఔట్.. మరిన్ని పడుతయ్
- పార్టీ ఫిరాయింపులతో ప్రజాతీర్పు కాలరాయాలని చూశారు
- ఎక్స్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం
- ఎన్నికల సంఘం నియంతృత్వ ధోరణి సరికాదు



హైదరాబాద్, సెప్టెంబర్ 24 : ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డికి చెంపపెట్టు అని బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. అనర్హత నుంచి తప్పించుకొనేందుకు దానం నాగేందర్ చేసిన ప్రయత్నాన్ని సుప్రీంకోర్టు తిరసరించిందని, హైకోర్టు ఇచ్చిన అనర్హత తీర్పును సమర్థిస్తూ స్పష్టమైన నిర్ణయం వెలువరించిందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాతీర్పును గౌరవించకుండా పార్టీ ఫిరాయింపుల ద్వారా ప్రజల మద్దతును కాజేయాలని రాహుల్, రేవంత్ భావించారని విమర్శించారు. స్పీకర్ వ్యవస్థను అడ్డుపెట్టుకుని ఫిరాయింపుదారులను కాపాడుకోవచ్చన్న యత్నాలకు గట్టి ఎదురుదెబ్బ తగిలిందని చెప్పారు. ఖైరతాబాద్ ప్రజలు త్వరలో తమ తీర్పును ఇవ్వబోతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. మూడేండ్ల మోసం, విఫలమైన హామీలు, ప్రజలకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకోకపోవడం, పాలనా వైఫల్యాలపై స్పష్టమైన తీర్పును చెప్పనున్నారని తెలిపారు. దానం నాగేందర్ అనర్హతతో ఒక వికెట్ పడిందని, ఇక ముందు మరిన్ని వికెట్లు పడుతాయని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీని ఉద్దేశించి కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా చెప్పుకొనే మన దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ఎన్నికల సంఘం తీరు నియంతృత్వ ధోరణిలోకి వెళ్తున్నదని కేటీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. ముగ్గురు ఎన్నికల కమిషనర్లలో ఇద్దరు పదేపదే అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నప్పుడు, ఈసీ పనితీరును సరిదిద్దాల్సిన అవసరం మిగతా 3లో..

## దంచికొట్టిన వానలు



- సగం రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు
- పిడుగుపాటుకు ముగ్గురు కూలీలు మృతి
- నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- మరో 2 రోజులు భారీ వర్షాలకు అవకాశం

మిగతా 2లో..

# అబద్ధాలు ప్రచారం చేస్తే కోర్టుకీడ్చుతాం

- మాజీ మంత్రి హరీశ్‌రావు హెచ్చరిక
- కాంగ్రెస్ నేతల క్షుద్రపూజల వ్యాఖ్యలపై నాంపల్లి ప్రజాప్రతి నిధుల కోర్టులో విచారణకు హాజరు
- 'దానం' కేసులో సుప్రీంకోర్టు తీర్పు రేవంత్‌కు చెంపపెట్టు అని వ్యాఖ్య



హైదరాబాద్,సెప్టెంబర్-24 : కాంగ్రెస్ నాయకులు తప్పుడు ఆ రోపణలను చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, ఎంతటి వారినైనా కోర్టుకు ఈడ్చి బుద్ధి చెబుతామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉపనేత హరీశ్‌రావు హెచ్చరించారు. గుడికి వెళ్లి దైవదర్శనం చేసుకుంటే 'క్షుద్రపూజలు' అంటూ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ నీచమైన ఆరోపణలకు పాల్పడ్డారని మండిపడ్డారు. వారిపై గురువారం నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో పరువు నష్టం దావా పిటిష న్ దాఖలు చేసిన అనంతరం కోర్టు ప్రాంగణంలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. కోర్టు తమ పిటిషన్‌ను స్వీకరించిందని, వచ్చే బుధవారం స్టేట్‌మెంట్లు రికార్డు చేసేందుకు పిలిచిందని వెల్లడించారు. కాంగ్రెస్ నేతలు ఎన్ని గోబెల్స్ ప్రచారాలు చేసినా, కేసులు పెట్టి వేధించినా తమకు న్యాయస్థానాలపై పూర్తి విశ్వాసం ఉన్నదని, పరువు నష్టం కలిగించిన వారికి చట్టపరంగా మిగతా 3లో..

# ట్యాంక్‌బండ్‌పై రోడ్డు ప్రమాదం.. ఎస్సై మృతి

**గణేష్ నిమజ్జనం విధుల్లో ఉండగా ఘటన**



హైదరాబాద్, సెప్టెంబర్ 24: నగరంలో వినాయక నిమజ్జన వేడుకల బందోబస్తు విధుల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ట్యాంక్ బండ్ వద్ద విధులు నిర్వహిస్తున్న ఎస్సై రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. వివరాల్లోకెళ్తే.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరుకు చెందిన వెంకన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్నాడు. వినాయక నిమజ్జనం బందోబస్తు కోసం డిప్యుటేషన్‌పై కొన్ని రోజుల కిందట హైదరాబాద్‌కు వచ్చి ట్యాంక్‌బండ్ పరిసరాల్లో భద్రతా పర్యవేక్షణ విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున ఎన్టీఆర్ మార్గ్ పరిధిలో రోడ్డు దాటుతుండగా అతివేగంగా వచ్చిన గుర్తుతెలియని మోటార్‌సైకిల్ వెంకన్నను బలంగా ఢీకొట్టింది. ప్రమాదం అనంతరం బైకర్ వాహనాన్ని ఆపకుండా అక్కడి నుంచి పరారయ్యాడు. వెంటనే తోటి సిబ్బంది వెంకన్నను సమీప ఆస్పత్రికి తరలిం చారు. ప్రాథమిక చికిత్స మిగతా 3లో..

# రేవంత్ నోట అబద్ధాలు



- 'యాదాద్రి' ప్లాంట్‌లో పరిస్థితిపై ఇంజినీర్లు వెల్లడించిన వాస్తవాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 24 : యాదాద్రి పవర్ ప్లాంట్‌పై సీఎం రేవంత్‌రెడ్డి తో పాటు ప్రభుత్వం చెప్తున్న విష యాలన్నీ అబద్ధాలని మరోసారి తేటతెల్లం అయ్యింది. పవర్ ప్లాంట్‌నే వృథా అన్నట్టు, 40 వేల కోట్ల అదనపు భారం అం టూ బుధవారం సీఎం చేసిన రివ్యూలో సైతం తప్పడు ప్రకట నలు చేసిన విషయం తెలిసి ందే. జీ9 గ్రేడ్ బొగ్గుతోనే యాదాద్రి పవర్ ప్లాంట్ నడుస్తున్న దని, ఆ బొగ్గు కొరతతో ఉత్పత్తి చేయలేక పోతు న్నట్టు ప్రభుత్వం పేర్కొన్నది.కానీ గురువారం మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నేతృ త్వంలోని మాజీ ఎమ్మెల్యేల బృందం పర్యటన లో ప్రభుత్వం చెప్తున్న మాటలు, చేస్తున్న ప్రకటనలన్నీ పచ్చి అబద్ధాలని తేలిపోయింది. స్వయంగా ప్లాంట్‌లోని అధికారులు, ఇంజినీర్లతో జగదీశ్‌రెడ్డి బృందం సమావేశమై ప్లాంట్ పరిస్థితిపై ఆరా తీశారు. మిగతా 3లో..

## దవాఖానల్లో ఫైర్ సేఫ్టీ చర్యలు పటిష్టం చేయాలి

రాజనర్సింహ



హైదరాబాద్, సెప్టెంబర్ 24 : రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో ఫైర్ సేఫ్టీ ప్రమాణాలను పటిష్టంగా అమలు చేయాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. గురువారం సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ నెలరోజుల్లో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ హాస్పిటళ్లలో ఫైర్, ఎలక్ట్రికల్, స్ట్రక్చరల్ ఆడిటింగ్ నిర్వహించాలని సూచించారు. ఫైర్, ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్‌కు ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# కాంగ్రెస్ బొగ్గునూ అమ్ముకుంటోంది



- విద్యుత్ సరఫరా, సాగునీటి విడుదలలో విఫలం : మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి
- యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వద్ద బీఆర్ఎస్ భారీ ధర్నా
- ప్లాంట్ లోపలికి వెళ్లేందుకు శ్రేణుల యత్నం.. అడ్డుకున్న పోలీసులు

హైదరాబాద్, సెప్టెంబర్ 24 : వ్యవసాయానికి కరెంట్ సరఫరా చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం బొగ్గును సైతం అమ్ముకుంటోందని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి విమర్శించారు. నల్లగొండ జిల్లా యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో 5 యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి చేయాల్సి ఉండగా బొగ్గును అమ్ముకుంటూ 2 యూనిట్లలోనే ఉత్పత్తి చేస్తున్నారని ఆరోపించారు. రైతులకు వ్యవసాయ విద్యుత్ సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ఆధ్వర్యంలో గురువారం యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వద్ద భారీ ధర్నా మిగతా 3లో..

# రేవంత్ భూదందాపై విచారిస్తారా?

- పొంగులేటి లూటీపై రెడీనా?
- రేవంత్‌రెడ్డి ఫ్యామిలీకి 460 ఎకరాల భూములు
- జడ్జితో విచారణంటే జంకెందుకు?
- జీవో 134 పేరిట బీఆర్ఎస్ నేతలపై కక్ష
- ఆనవాళ్లు చెరపడం రేవంత్ తరం కాదు
- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆగ్రహం



హైదరాబాద్, సెప్టెంబర్ 24 : 'రేవంత్‌రెడ్డీ.. నీకు దమ్ముం, ధైర్యముంటే మీ ఫ్యామిలీతోపాటు మంత్రి పొంగులేటి కుటుంబం చేస్తున్న భూదందాలపై విచారణకు సిద్ధమేనా?' అని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సవాల్ విసిరారు. అప్పుడే మీరు వేసిన అధికారుల కమిటీ విచారణపై ప్రజలకు నమ్మకం ఉంటుందని, లేదంటే దానిని అంతా తొండి కమిటీగా భావిస్తారని తేల్చి చెప్పారు. సుప్రీంకోర్టు జడ్జితో విచారణకు సిద్ధమని కేటీఆర్, మిగతా 3లో..

## చేయూత పెన్షన్ల దరఖాస్తుల పరిశీలనకు గడువు పొడిగింపు

**చేయూత కొత్త పెన్షన్ దరఖాస్తుల పరిశీలన గడువు సెప్టెంబర్ 30 వరకు పొడిగింపు**

హైదరాబాద్, సెప్టెంబర్ 24 : చేయూత సామాజిక భద్రత పెన్షన్లకు కొత్తగా వచ్చిన దర ఖాస్తుల పరిశీలనకు ప్రభుత్వం గడువు పొడిగించింది. ఇప్పటి వరకు సెప్టెంబర్ 25 వరకు ఉన్న గడువును సెప్టెంబర్ 30 వరకు పొడిగిస్తూ సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ ఉత్తర్వులు జారీ చేశారు.ఫీల్డ్ స్థాయి అధికారులు SIR విధులు, వినాయక నిమజ్జన ఏర్పాట్లు, ఇతర బాధ్యతల్లో నిమగ్నమై ఉండటంతో నిర్ణీత గడువులో దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయలేకపో తున్నామని వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు చేయూత కొత్త పెన్షన్ దరఖాస్తుల పరిశీలనను పొడిగించిన గడువులోగా పూర్తిచేయాలని సెర్ప్



ఆదేశించింది.దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అర్హత కలిగిన ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

# కొత్తగూడెం టూ-టౌన్ ఎస్ఐ వెంకన్న మృతి బాధాకరం : సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 24 : గణేష్ నిమజ్జనం బందోబస్తు విధుల్లో ఉండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ కొత్తగూడెం టూ–టౌన్ ఎస్ఐ కె. వెంకన్న మృతి చెందడం అత్యంత బాధాకరమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో అంకిత భావంతో విధులు నిర్వర్తిస్తూ వెంకన్న ప్రాణాలు కోల్పోవడం విషాదకరమని సీఎం అన్నారు. ఆయన మర ణం కుటుంబ సభ్యులకే కాకు ండా మొత్తం పోలీసు శాఖ కు తీరని లోటని పేర్కొన్నారు. వెంకన్న పవి త్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవం తుడిని ప్రార్థించిన సీఎం.. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంకన్న కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. బాధ్యతారాహిత్యంగా వాహనం నడిపి ప్రమాదానికి కారణమైన వ్యక్తిని గుర్తించి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను సీఎం ఆదేశించారు.

# మాదాపూర్ యువతి మృతి కేసులో కీలక పరిణామం





హైదరాబాద్, సెప్టెంబర్ 24:
మాదాపూర్‌లోని ఓ ఈూ హోటల్‌లో యువతి అనుమానాస్పద మృతి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసులో పరారీలో ఉన్న యువతి ప్రియుడు రవితేజ అనకాపల్లి జిల్లాలోని తన ఇంట్లో ఫ్లోర్ క్లీనింగ్ లిక్విడ్ తాగి ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులు అతడిని ఆసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం ఖ+ఎకు తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. యువతి మృతికి గల కారణాలు, రవితేజతో ఆమెకు ఉన్న సంబంధం, హోటల్‌లో జరిగిన పరిణామాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. జజుఎ ఫుటేజీ, ఇతర ఆధారాలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గణేష్ నిమజ్జనంలో విషాదం.. విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

హైదరాబాద్, సెప్టెంబర్ 24: గణేష్ నిమజ్జన వేడుకల్లో విషాద ఘటన చోటుచేసుకుంది. విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందిన సంఘటన జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం కొత్తపేటలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొప్పుల రాజశేఖర్ (23) నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న సమయంలో ప్రమాదానికి గురైనట్లు గ్రామస్థులు తెలిపారు. రాత్రి సుమారు 11 గంటల సమయంలో సౌండ్ బాక్సులకు విద్యుత్ సరఫరా చేసే మెయిన్ వైర్లను కర్రతో సరిచేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురైనట్లు సమాచారం. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు తెలుస్తోంది. యువకుడి మృతితో కొత్తపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# దంచికొట్టిన వానలు

- సగం రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు
- పిడుగుపాటుకు ముగ్గురు కూలీలు మృతి
- నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- మరో 2 రోజులు భారీ వర్షాలకు అవకాశం



హైదరాబాద్, సెప్టెంబర్ 24 : బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం బుధ వారం అర్ధ రాత్రి కళింగ పట్నం వద్ద తీరాన్ని తాకింది. దీంతో గురువారం జయ శంకర్ భూపాలపల్లి, ఖమ్మం జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. హనుమకొండ, జనగామ, కరీం నగర్, సూర్యాపేట, వరంగల్, ఖమ్మం, కుమ్రం భీం, మహబూ బాబాద్, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి–కొత్తగూడెం, మంచిర్యాల, నల్లగొండ, పెద్దపల్లి, సిద్దిపేట, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వానలు పడ్డాయి. కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు, ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజర్‌లో చెట్లు, విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. ఇండ్ల కప్పులు ఎగిరిపోయాయి. మణుగూరు సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. మహబూబాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, పెద్దపల్లి, సూర్యాపేట జిల్లాలకు అధికారులు ఆరెంజ్ హెచ్చరిక జారీచేశారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, నల్లగొండ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఖమ్మం జిల్లాలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో రెండు రోజులపాటు భారీ, అతి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని సూచించారు.

### పిడుగుపాటు.. ముగ్గురు కూలీలు మృతి

వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం సూగూరులో పొలం పనులకు వెళ్లిన మహిళలపై పిడుగు పడి ముగ్గురు మృతిచెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వరి పొలంలో కలుపు తీస్తుండగా ఒకసారిగా పిడుగు పడి కుమ్మరి లక్ష్మి మృత్యువాతపడింది. ఎడ్ల యాదమ్మ కూలీ పనులకు వెళ్లి ఇంటికి వస్తుండగా మార్గం మధ్యలో పిడుగుపడటంతో ఆమె మరణించారు.

### పలు ప్రాంతాల్లో 10 సెం.మీపైగా..

సీజన్‌లో మొదటిసారి పలు జిల్లాల్లో 10 సెం.మీపైగా వర్షపాతం నమోదైనట్టు వాతవరణ శాఖ అధికారులు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో 12.36 సెం.మీ, పెద్దవంగరలో 11.86 సెం.మీ, మరిపెడలో 11.41 సెం.మీ, నెల్లికోదూరులో 10.83 సెం.మీ, చిన్నగూడురులో 10.34 సెం.మీ, మధిరలో 11.72 సెం.మీ, ముదిగొండలో 11.61 సెం.మీ వర్షపాతం నమోదైంది.

# ప్రభుత్వ వైద్య సేవలు విస్తృతంగా అందించాలి

- ఇమ్యూనైజేషన్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలి
- అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతి మంగళవారం '10 నిమిషాల కార్యక్రమం' నిర్వహించాలి
- ఎన్‌సీడీ స్క్రీనింగ్ పూర్తి చేసి అవసరమైన వారికి చికిత్స అందించాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- వైద్య ఆరోగ్య శాఖ పనితీరుపై సమీక్ష



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 24: ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు విస్తృతంగా అందించేందుకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. సీజనల్ వ్యాధులు, ఇమ్యూనైజేషన్, ఎన్‌సీడీ స్క్రీనింగ్, మొబైల్ ఎక్స్‌రే, టీబీ కేసులు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ గురువారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణుల ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ సజావుగా జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి సోమవారం పీహెచ్‌సీలకు వచ్చే గర్భిణులకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా వేడి భోజనం అందించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గర్భిణుల్లో పోషకాహార లోపం, రక్తహీనతను నివారించేందుకు ఐరన్ మందులు, పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు, ప్రసవాల సంఖ్య పెరిగేలా వైద్య సిబ్బంది ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని తెలిపారు. ఇమ్యూనైజేషన్ ప్రక్రియను సజావుగా పూర్తి చేసి, జిల్లాలో 100 శాతం లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు. ప్రతి మంగళవారం అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో '10 నిమిషాల కార్యక్రమం' నిర్వహించాలని, ఈ కార్యక్రమానికి వైద్యులు హాజరై పిల్లలను పరీక్షించాలని సూచించారు. ఎంపీడీఓలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. తీవ్రమైన, మధ్యస్థ పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలు, తీవ్రమైన మరియు మధ్యస్థ తక్కువ బరువు ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపించి వైద్య సేవలు, మందులు అందించాలని సూచించారు. ఐదేళ్లలోపు ఎదుగుదల లోపాలు ఉన్న పిల్లలు, వినికిడి లేదా మాట సమస్యలు ఉన్నవారు, మేధో వైకల్యం ఉన్నవారు, నడవలేని పిల్లలు, పుట్టుకతో వచ్చే లోపాలు లేదా మెదడుకు సంబంధించిన సమస్యలు ఉన్న పిల్లలను గుర్తించి ఆర్‌బీఎస్‌కే వాహనం ద్వారా వేములవాడ ఏరియా ఆసుపత్రిలోని డీఈఐసీ కేంద్రానికి తరలించి వైద్య సేవలు అందించాలని తెలిపారు. అవసరమైన పిల్లలను కరీంనగర్‌లోని ఎన్‌ఆర్‌సీ కేంద్రానికి, అవసరాన్ని బట్టి హైదరాబాద్‌లోని ఉన్నత వైద్య కేంద్రాలకు పంపించి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డే నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం 531 టీబీ కేసులు ఉన్నాయని అధికారులు తెలిపారు. టీబీని ముందస్తుగా గుర్తిస్తే చికిత్స అందించి పూర్తిగా నయం చేయవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. టీబీని నిర్లక్ష్యం చేస్తే ఇతరులకు వ్యాధి సోకే ప్రమాదం ఉన్నందున, లక్షణాలు ఉన్న వారిని గుర్తించేందుకు గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో ఎన్‌సీడీ స్క్రీనింగ్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసి, వ్యాధులు గుర్తించిన వారికి అవసరమైన చికిత్స అందించాలని సూచించారు. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి తదుపరి వైద్య సేవలు అందించాలని తెలిపారు. మొబైల్ ఎక్స్‌రే యంత్రాన్ని జిల్లాలో అవసరమైన ప్రాంతాల్లో వినియోగించి పరీక్షలు నిర్వహించాలని, వ్యాధి నిర్ధారణ అయిన వారికి వైద్యం, మందులు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్, డీసీహెచ్‌ఎస్ సుభాషిణి, ప్రోగ్రామ్ అధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనానికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- సిరిసిల్ల జిల్లాలో సుమారు 300 మంది పోలీసులతో బందోబస్తు
- డీజేలకు అనుమతి లేదు.. రీల్స్, సెల్ఫీల పేరుతో ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలి: ఎస్పీ మహేష్ బి. గీతే



హైదరాబాద్, సెప్టెంబర్ 24 : సిరిసిల్ల పట్టణంతో పాటు జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల్లో రేపు నిర్వహించనున్న గణేష్ నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే తెలిపారు. నిమజ్జనం సందర్భంగా సుమారు 300 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, రూట్ డైవర్షన్లు తదితర భద్రతా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ వెల్లడించారు. శోభాయాత్రలు వెళ్లే మార్గాలు, ప్రధాన కూడళ్లు, నిమజ్జన ప్రాంతాలు, రద్దీగా ఉండే ప్రదేశాల్లో పికెట్లు, పుషింగ్ పార్టీలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే వేములవాడతో పాటు జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల్లో గణేష్ నిమజ్జనోత్సవం ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా విజయవంతంగా ముగిసిందని ఎస్పీ తెలిపారు. రేపు శోభాయాత్ర, నిమజ్జనం నిర్వహించే గణేష్ మండపాల నిర్వాహకులు నిర్దేశించిన సమయానికి నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేసి, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసుల సూచనలకు అనుగుణంగా ప్రణాళిక చేసుకోవాలని సూచిం చారు. ఎలాంటి గొడవలు, అవాంఛనీయ సంఘటనలు, ప్రమా దాలు జరగకుండా శాంతియుత వాతావరణంలో శోభాయాత్ర సాగేలా పోలీసులకు సహకరించాలని కోరారు.

### రీల్స్, సెల్ఫీల కోసం ప్రమాదాలకు పాల్పడొద్దు..

గణేష్ శోభాయాత్ర సందర్భంగా రీల్స్, సెల్ఫీలు తీసుకునే క్రమంలో ప్రమాదకరంగా వాహనాలపైకి ఎక్కడం, క్రేన్లు లేదా గణేష్ విగ్రహాలపైకి ఎక్కడం, నీటి ప్రాంతాల వద్ద ప్రమాదకరంగా సెల్ఫీలు తీసుకోవడం, వాహనాల కదలికలకు అడ్డుగా నిలబడటం వంటి చర్యలకు పాల్పడవద్దని ఎస్పీ సూచించారు. సోషల్ మీడియాలో వీడియోలు, రీల్స్ కోసం ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుకోవద్దని, ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత భద్రతతో పాటు ఇతరుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలని కోరారు. నిబంధనలు తప్పక పాటించాలి.. నిమజ్జనం రోజున ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలకు అనుమతి లేదు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. గణేష్ మండపాల నిర్వాహకులు నిర్దేశించిన సమయానికి ఆలస్యం చేయకుండా నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేయాలి. శోభాయాత్రలో ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా పాటలు వినిపించడం, బాణాసంచా కాల్చి ప్రజలకు ఇబ్బందులు కలిగించడం వంటి చర్యలకు పాల్పడవద్దు. శోభాయాత్రలో క్రమపద్ధతిలో క్యూ పాటించాలి. నిమజ్జనానికి వినియోగించే వాహనాలు మంచి కండిషన్‌లో ఉండేలా నిర్వాహకులు ముం దస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. మద్యం సేవించి శోభాయాత్రలో పాల్గొని ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు ఏర్పడినా వెంటనే పోలీసులకు సమా చారం అందించాలి. శోభాయాత్రలో పాల్గొనే భక్తులకు, ముఖ్యం గా మహిళలు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. గణేష్ నిమజ్జనో త్సవం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే కోరారు.

# G.O.No.25ను పునఃపరిశీలించాలి

- ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలి



హైదరాబాద్, సెప్టెంబర్ 24 : ఉపాధ్యాయులపై పెరుగుతున్న పని ఒత్తిడిని తగ్గించాలని, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని, G.O.No.25ను పునఃపరి శీలించాలని డిమాండ్ చేస్తూ SGTU రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్ర మాల్లో భాగంగా కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలంలో రాష్ట్ర అధ్యక్షుడు కరివేద మహిపాల్ రెడ్డి పాల్గొని ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రవ్యాప్తంగా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో, అలాగే పాఠశాలల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారు. ప్రాథమిక విద్యారంగాన్ని బలోపేతం చేయాలంటే పాఠశాలల్లో తగినంత మంది ఉపాధ్యాయులను నియ మించడం అత్యవసరమని SGTU రాష్ట్ర శాఖ పేర్కొంది. ముఖ్యంగా విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశా లల్లో సర్దుబాటు పూర్తయ్యే వరకు తక్షణమే విద్యా వాలంటీర్లను నియమించాలని డిమాండ్ చేసింది.

### ప్రధాన డిమాండ్లు..

G.O.No.25ను పునఃపరిశీలించి, అవసర మైన సవరణలు చేయాలి. FLN Competent Schoolsలో ప్రతి సబ్జెక్టుకు ఒక ఉపాధ్యాయుడిని కేటా యించాలి. ప్రాథమిక పాఠ శాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలి. SGTలపై పెరుగుతున్న పని ఒత్తిడిని తగ్గించాలి. విద్యార్థుల సం ఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో తక్షణమే విద్యా వాలంటీర్లను నియమించాలి. FLN Panel Inspection పేరుతో ఉపాధ్యా యులపై అదనపు ఒత్తిడిని తగ్గించాలి. బోధనేతర పనులను, అనవసరమైన సమావేశాలు, రికార్డులు, నివేది కలను తగ్గించాలి. ఉపాధ్యాయులు స్వేచ్ఛాయు తమైన వాతావరణంలో బోధన కొనసాగించేలా ప్రభుత్వం చర్య లుతీసుకోవాలి. ప్రస్తుతం అనేక పాఠశాలల్లో ఉపాధ్యా యుల కొరత కారణంగా ఒకే ఉపాధ్యాయుడు బహుళ తరగతులకు బోధించాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి తోడు ప్రధానోపాధ్యాయ బాధ్యతలు, ఆన్‌లైన్ పను లు, రికార్డుల నిర్వహణ, సమావేశాలు, నివేదికలు, వరు స తనిఖీలు, FLN Panel Inspectioఅ టీమ్‌ల పర్య వేక్షణ వంటి అదనపు బాధ్యతలు ఉపాధ్యాయులపై తీవ్ర మైన పనిఒత్తిడినికలిగిస్తున్నాయని SGTU రాష్ట్ర శాఖ పేర్కొంది. జగిత్యాల జిల్లా చిల్వకోడూరు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ప్రశాంత్ కాంప్లెక్స్ సమావేశం సందర్భం గా తీవ్ర ఒత్తిడికి గురైన ఘటన నేపథ్యంలో ఉపాధ్యా యులపని పరిస్థితులపై ప్రభుత్వం తక్షణమే స్పందించా ల్సినఅవసరంఉందని సంఘం పేర్కొంది. ఉపాధ్యా యులౌ ఐఒత్తిడిపెంచడం ద్వారా కాకుండా, అవస రమైన స్థాయి లో ఉపాధ్యాయులను నియ మించి, బోధ నకు అనుకూల మైనపని వాతావరణాన్ని కల్పించడం ద్వారానే విద్యార్థు లకు నాణ్యమైన విద్య అందిం చగల మని SGTU రాష్ట్ర శాఖ స్పష్టం చేసింది. "ప్రతి తరగతికి --ఒక ఉపాధ్యా యుడు""ఉపాధ్యా యులపై పని ఒత్తిడిని తగ్గించాలి" "బోధనకు ప్రాధాన్యత -- బోధనేతర పనులకు నియంత్రణ"»»G.O.No.25ను పునః పరిశీలిం చాలి"ప్రభుత్వం క్షేత్రస్థాయిలోని పాఠశాలలను, ఉపాధ్యాయుల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి, విద్యారంగాన్ని బలోపేతం చేసే చర్యలు తక్షణమే చేపట్టాలని SGTU రాష్ట్ర శాఖ డిమాండ్ చేసింది.

# సీఎం రేవంత్ రెడ్డికి 'ఆర్యదాన్ ముహమ్మద్' అవార్డు



హైదరాబాద్, సెప్టెంబర్ 24 : తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. కేరళకు చెందిన ప్రతిష్ఠాత్మక ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ అందజేస్తున్న 'ఆర్యదాన్ ముహమ్మద్ -- 2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్' అవార్డుకు ఆయన ఎంపికయ్యారు. తెలంగాణలో ప్రజాస్వామ్య విలువల పట్ల నిబద్ధతతో పాటు రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం ఆయన అమలు చేస్తున్న వినూత్న పథకాలు, దూరదృష్టి గల నాయకత్వాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ చైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ ప్రకటించారు. ఈ అవార్డు ప్రదానోత్సవం కేరళలోని నిలంబూర్‌లో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు జరగనుంది. దివంగత కాంగ్రెస్ సీనియర్ నేత ఆర్యదాన్ ముహమ్మద్ 4వ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అవార్డును స్వీకరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే కేరళ చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కే.సీ. వేణుగోపాల్ స్మారకోపన్యాసం చేయనున్నారు. రూ. లక్ష నగదు బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపికను రేవంత్ రెడ్డికి అందజేయనున్నారు.

# (మొదటిపేజీ తరువాయి)

## 22ఏ సమస్యలకు ఫాస్ట్‌ట్రాక్ పరిష్కారం

సంస్థల ప్రతినిధి సభ్యులుగా ఉంటారని తెలిపారు. 22ఏ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఇప్పటికే అమల్లోకి వచ్చిన నిర్ణయాలే నిదర్శనమని పేర్కొన్నారు. రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లాల్లోని దాదాపు 64 కాలనీల ఇండ్ల క్రమబద్ధీకరణ సమస్యకు జీవో 118కు అనుగుణంగా మెమో జారీ చేశామని తెలిపారు, దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న సింగరేణి కార్మికుల ఇండ్ల క్రమబద్ధీకరణ సమస్యను కూడా ప్రభుత్వం జీవో 76 ద్వారా పరిష్కరించే దిశగా కీలక నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. భూమి, ఇల్లు వంటి అంశాల్లో ప్రజలు ఏండ్ల తరబడి ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితికి ముగింపు పలకడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను కేవలం ఫైళ్లకే పరిమితం చేయకుండా, ప్రజలకు ప్రత్యక్షంగా ఉపశమనం కలిగేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు. 22ఏలోని అన్ని భూములనూ ఒకే గాటన కట్టకుండా, భూమి స్వభావం, అందుబాటులో ఉన్న రికార్డులు, చట్టబద్ధమైన అనుమతులు, న్యాయపరమైన అంశాలను పరిశీలించి అర్హమైన సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు.

## రాహుల్, రేవంత్‌కు సుప్రీం తీర్పు చెంపపెట్టు

ఉన్నదని ఆయన అభిప్రాయపడ్డారు. ముగ్గురిలో ఇద్దరు ఒక నిర్ణయానికి వ్యతిరేకంగా ఉన్నప్పుడు అది మెజారిటీ కాదా? అని ప్రశ్నించారు. ఇప్పటివరకు మెజారిటీ అంటే ఇదే కదా.. ఇప్పుడు దాని నిర్వచనం కూడా మారుతున్నదా? అని నిలదీశారు. ఓటర్ల నమోదు, ఓట్ల తొలగింపు, తొలగించిన ఓట్లను తిరిగి చేర్చడం వంటి అంశాల్లో సందేహాలకు తావిచ్చేలా నిర్ణయాలు తీసుకుంటే.. 'అసలు మనం ఇంకా ప్రజాస్వామ్యంలోనే ఉన్నామా?' అని కేటీఆర్ అనుమానం వ్యక్తంచేశారు.

## రేవంత్ నోట అబద్ధాలు..

గతంలో తానే విద్యుత్ మంత్రిగా పనిచేయడం, యాదాద్రి థర్మల్ ప్లాంట్ నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషించడంతో ప్లాంట్ పై తనకు ఉన్న అవగాహనతో అధికారులతో మాట్లాడారు. జగదీశ్‌రెడ్డి అడిగిన ఒక్కో విషయానికి సమాధానమిస్తూ అధికారులు వాస్తవాలు ఏంటో వెల్లడించారు. జీ9 గ్రేడ్ బొగ్గు సరఫరాపై చర్చిస్తూ... జీ7- జీ13 గ్రేడ్ వరకు ప్లాంట్ నడపొచ్చు కదా అని అడగ్గా... రన్ చేయొచ్చు అని అధికారులు చెప్పారు. ప్లాంట్ నిర్మాణం సమయంలో జీ9 బొగ్గు సరఫరా కోసం ఒప్పందం జరిగిందని తెలిపారు. కానీ ఇప్పుడు హఠాత్తుగా సింగరేణి గ్రేడ్ జీ9 బొగ్గు సరఫరా ఆపేసిందని చెప్పారు. అందుకే విద్యుత్ ఉత్పత్తి తగ్గిందని ఇంజినీర్లు వివరించారు. ఒక్కో యూనిట్ సామర్థ్యం 800 మెగావాట్లు ఉండగా ప్రస్తుత బొగ్గుతో కేవలం ఒక్కో యూనిట్ లో 600 మెగావాట్లే ఉత్పత్తి చేయగలుగుతున్నామని చెప్పారు. జనరల్ గా ప్లాంట్ లో 20 రోజుల విద్యుత్ ఉత్పత్తికి సరిపడా బొగ్గు స్టాక్ ఉండాల్సి ఉండగా, కేవలం నాలుగు రోజులకే ఉన్నట్టు తెలిపారు. ఇక గతంలో సింగరేణి ఒప్పందం ప్రకారం... గ్రేడ్ డిక్లరేషన్ డాక్యుమెంట్‌లో 13 బ్లాకుల్లో గ్రేడ్ 9 బొగ్గు ఉత్పత్తి చేస్తామని ఉందని తెలిపారు. కానీ జీ 9 గ్రేడ్ బొగ్గుకు బదులు ప్రస్తుతం జీ 11- జీ 13 గ్రేడ్ బొగ్గు వస్తున్నదని తేలింది.

## దానం నాగేందర్ ఔట్!..

ధర్మాసనం గురువారం తీర్పు వెలువరించింది. హైకోర్టు చట్టాన్ని సరిగానే అర్థం చేసుకొని తీర్పునిచ్చిందని, అందులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించింది. బీఆర్ఎస్ తరఫున గెలిచి, ఆ పార్టీ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడం అనేది పదో షెడ్యూల్ కింద అనర్హతకు దారితీసే చర్యగా హైకోర్టు నిర్ధారించడాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. హైకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగబద్ధంగానే ఉన్నదని, ఇలాంటి కేసుల్లో ఫిరాయింపుదారులకు ఉపశమనం కల్పించలేమని తేల్చిచెప్పింది.

## అబద్ధాలు ప్రచారం చేస్తే కోర్టుకీడ్చుతాం

శిక్ష పడేదాకా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన స్పష్టంచేశారు. ప్రజాసమస్యలను పకదారి పట్టించేందుకే ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని హరీశ్‌రావు దుయ్యబట్టారు. ఇచ్చిన హామీల గురించి ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తున్నారని, అసెంబ్లీలోనూ పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీలో సభా హకుల ఉల్లంఘన నోటీసులు ఇచ్చినా స్పీకర్ పట్టించుకోవడం లేదని, ప్రివిలేజెస్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించాల్సిన డిప్యూటీ స్పీకర్‌ను మూడేండ్లు గడిచినా నియమించలేదని తప్పుబట్టారు.

## ట్యాంక్‌బండ్‌పై రోడ్డు ప్రమాదం.. ఎస్సై మృతి

అనంతరం పరిస్థితి మెరుగ్గా కనిపించడంతో స్వగ్రామానికి బయలుదేరారు. అయితే మార్గమధ్యంలో తీవ్ర అసౌకర్యం, తలతిరగడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి తుదిశ్వాస విడిచారు. తలకు తీవ్ర గాయం కావడంతో మెదడులో రక్తం గడ్డకట్టినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనపై సైఫాబాద్ పోలీసులు హిట్ అండ్ రన్ కేసు నమోదు చేశారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పరారీలో ఉన్న బైకర్ కోసం గాలిస్తున్నారు. ఎస్సై మృతిపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్, ఉన్నతాధికారులు తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు.

## రేవంత్ భూదందాపై విచారిస్తారా?

హరీశ్‌రావు ప్రకటించారని, అదే జరిగితే అధికార పెద్దల బాగోతాలు ఎక్కడ బయట పడుతాయోననే ప్రతిపక్ష నేతలపై వేధింపుల కమిటీ వేశారని మండిపడ్డారు. 134 జీవో పేరిట ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై కక్ష సాధిస్తున్నారని, అధికారుల కమిటీని అడ్డంపెట్టుకొని ప్రధాన ప్రతిపక్షం గొంతు నొక్కేందుకు కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో గురువారం కార్పొరేషన్ మాజీ చైర్మన్ చిరుమళ్ల రాకేశ్, పార్టీ నేతలు అభిలాష్ రంగినేని, కల్వకుర్తి శ్రీనివాస్‌యాదవ్, మంద శ్యామ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రజాపాలన ముసుగులో ప్రతీకార పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీలో 22-ఏలోని నిషేధిత భూములపై చర్చ తర్వాత విచారణకు జీవో 134 కింద కమిటీ వేశామని ప్రభుత్వం చెప్పడం ఆక్షేపణీయమని పేర్కొన్నారు.

## కాంగ్రెస్ బొగ్గునూ అమ్ముకుంటోంది



నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్లాంట్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. భారీగా పోలీసు బలగాలను మోహరించి బారికేడ్లు ఏర్పాటు చేసి బీఆర్ఎస్ శ్రేణులను ఎక్కడికక్కడా నిలువరించారు. మొదట మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ప్లాంట్ లోపలికి వెళ్లి సీఈని కలిసి ఎంత ఉత్పత్తి అవుతుంది, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా చేయడంతో పాటు, సాగుకు అవసరమైన నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉన్నప్పటికీ సరిపడా విద్యుత్ అందడం లేదన్నారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌లో ఐదు యూనిట్లకు సరిపోను బొగ్గు సరఫరా చేసి విద్యుత్ ఉత్పత్తి చేయాలని డిమాండ్ చేశారు. పంటలు ఎండిపోకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను సక్రమంగా అందించాలని, సాగునీటి విడుదలపై స్పష్టమైన చర్యలు చేపట్టాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇక్కడ 4 వేల మెగావాట్ల విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేస్తే.. చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం బొగ్గు సరఫరా చేయకుండా అమ్ముకొని విద్యుత్ ఉత్పత్తిలో ఆటంకం కల్పిస్తున్నదన్నారు. రైతులకు సాగు సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా చేయడంతో పాటు, రెండు పంటలకు అవసరమైన సాగునీటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రామావత్ రవీంద్ర కుమార్ నాయక్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, నోముల భగత్, పైళ్ల శేఖర్ రెడ్డి, గాదరి కిషోర్, ప్రభాకర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, తిప్పన విజయసింహ రెడ్డి, రాష్ట్ర నాయకులు పిల్లుట్ల రఘు, నరసింహ రెడ్డి, ఇస్లావాత్ రామచందర్ నాయక్, పల్లె రవి, చింతల వెంకటేశ్వరరెడ్డి, చింతరెడ్డి శ్రీనివాస రెడ్డి, దుర్గంపూడి నారాయణ రెడ్డి, మందడి సైదిరెడ్డి పాల్గొన్నారు.

## క్షుద్రపూజల ఆరోపణల కేసు.. కోర్టుకు హాజరైన హరీశ్‌రావు

- కాంగ్రెస్ నేతలు తనపై చేసిన క్షుద్రపూజల ఆరోపణల
- తీవ్రంగా ఖండించిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు



హైదరాబాద్, సెప్టెంబర్ 24 :
కాంగ్రెస్ నేతలు తనపై చేసిన క్షుద్రపూజల ఆరోపణలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. తనపై నిరాధార ప్రచారం చేశారంటూ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌కు ఇప్పటికే లీగల్ నోటీసులు పంపినప్పటికీ వారి నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో.. ఆయన కోర్టులో పరువు నష్టం దావా వేశారు. ఈ నేపథ్యంలో గురువారం స్వయంగా కోర్టుకు హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. వ్యక్తిగత విషయా లపై ఇలాంటి తప్పుడు ప్రచారాలు ఎవరు చేసినా, ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. తాను దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు విచారణకు స్వీకరించిందని, వచ్చే బుధవారం స్టేట్‌మెంట్ రికార్డు చేస్తుందని తెలిపారు. ఎన్నికల సమయంలో అడ్డగోలు హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ.. వాటి అమలును తాము ప్రశ్నిస్తుంటే ప్రజల దృష్టిని మళ్లించేం దుకు డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతో ందని హరీశ్ రావు మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు ఏమయ్యా యని ప్రభుత్వాన్ని నిలదీశారు. శాసనసభ లోనూ అధికార పార్టీ అబద్ధాలు చెబుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఇన్ని ఏళ్లవుతున్నా.. ప్రివిలేజ్ కమిటీకి చైర్మన్‌గా ఉండే డిప్యూటీ స్పీకర్ పదవిని ఇప్పటివరకు భర్తీ చేయలేదని విమర్శించారు. అసెంబ్లీని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజీనామా చేయించాలని డిమాండ్..ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ విషయం లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెంపపెట్టు లాంటిదని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. నిత్యం రాజ్యాంగాన్ని చేతపట్టుకుని తిరిగే రాహు ల్ గాంధీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే.. పార్టీ మారిన ఎమ్మెల్యే ల చేత రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. ఇవాళ కాకపోయినా రేపైనా మిగతా పార్టీ ఫిరాయింపు ఎమ్మె ల్యేలకుఇదేపరిస్థితిఎదురుకాక తప్పదని ఆయన స్పష్టం చేశారు.

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్ 48 గంటల్లో రాజీనామా చేయాలి

- కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) డిమాండ్



హైదరాబాద్, సెప్టెంబర్ 24 :
భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (CEC) జ్ఞానేశ్ కుమార్ 48 గంటల్లో తన పదవికి రాజీనామా చేయాలని 'కాక్రోచ్ జనతా పార్టీ' (CJP) డిమాండ్ చేసింది. ఆయన గడువులోగా వైదొలగ కపోతే దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు, ఆందోళనలు చేపడతా మని హెచ్చరించింది. అంతేకాకుండా, రాబోయే అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను తాత్కాలికంగా నిలిపివేయాలని డిమాండ్ చేసింది. న్యూఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే, కో-కన్వీనర్ సౌరవ్ దాస్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై తీవ్ర ఆరోపణలు గుప్పించారు. సీఈసీ రాజీనామాతో పాటు, ఆయనతో పాటు ఈ నిర్ణయాల వెనుక ఉన్నవారిపై క్రిమినల్ చర్యలు తీసు కోవాలని, రాబోయే ఎన్నికలను వాయిదా వేయాలని మూడు ప్రధాన డిమాండ్లను వెలిబుచ్చారు. ఇదే సమయంలో, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియను 2025 నాటి ఓటర్ల జాబితా స్థితికి వెనక్కి తీసుకోవాలని, ఎస్ఐఆర్ ఫైళ్లను సుప్రీం కోర్టు నేతృత్వంలోని కమిటీ ఆధీనంలో ఉంచాలని కోరారు. అలాగే, ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన ప్రస్తుత చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈసీ వివరణ..మరోవైపు, గత 10 నెలల్లో ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన నిర్ణయాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలుమార్లు అభ్యంతరాలు తెలిపారంటూ 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ఇటీవల ఓ నివేదికను వెలువరించింది. అయితే ఈ నివేదికను ఎన్నికల సంఘం తీవ్రంగా ఖండించింది. ఎస్ఐఆర్ సహా అన్ని కీలక నిర్ణయాలను పూర్తి కమిషన్ ఏకగ్రీవంగా ఆమోదించిందని స్పష్టం చేసింది. చర్చల సమయంలో కమిషనర్లు తమ అభిప్రాయాలు, అభ్యంతరాలు వ్యక్తంచేయడం సాధారణ అంతర్గత ప్రక్రియలో భాగమేనని ఈసీ తేల్చిచెప్పింది. అమెరికా బాండ్ల రాబడులు సైతం మార్కెట్‌పై ఒత్తిడిని పెంచాయి. అమె రికా పదేళ్ల బాండ్ ఈల్డ్స్ 2007 గరిష్ఠానికి చేరడం ఈక్విటీ ఇన్వెస్టర్లనను ఆందోళనకు గురిచేస్తోంది. ఇన్సూరెన్స్ రెగ్యులే టరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా బీమా కమీషన్ నిబంధనలలో చేసిన ప్రతిపాదిత మార్పుల కారణంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ స్టాక్స్ భారీగా పడిపోయాయి. మార్కెట్ పతనానికి ఇది కూడా ఒక కారణం.

## ప్రాథమిక పాఠశాలల ప్యానల్ తనిఖీలు రద్దు చేయాలి



### టిపిస్పిటిఎ

హైదరాబాద్, సెప్టెంబర్ 24 :
ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్యానల్ తనిఖీలను వెంటనే నిలిపివేయాలని తెలంగాణ స్టేట్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (టిపిస్పిటిఎ) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ షౌకత్ అలీ ఆర్ రోహిత్ నాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో పూర్తి స్థాయిలో బోధనా సిబ్బంది మరియు ఇతర వసతులు కల్పన లేకుండా ప్యానల్ తనిఖీల పేరుతో ప్రాథమిక ఉపాధ్యాయులను భయాందోళనలకు గురి చేస్తున్నారని, అందులో భాగంగానే జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చిల్వకోడూరు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బి ప్రశాంత్ పని వత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడి మృత్యువు తో పోరాడుతున్నారడని దీనికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు. నేడు రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు విద్యాపరమైన బాధ్యతలు నిర్వహించడానికే సమయం చాలక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రోజు 18 సబ్జెక్టు లతో కూడిన బహుళ తరగతి బోధన, విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు, వివిద యాప్ లలో రోజు వారి రిపోర్ట్ నమోదు, ఎఫ్ ఎల్ ఎన్ అనుసరించి రికార్డుల నమోదు నిర్వ హణ, ఉదయం సిఎం అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకం అమలు లకు తోడు జిల్లా కలెక్టర్ నుంచి గల్లీ లీడర్ ల సంద ర్శనలు మరియు వారికి సపచర్యలు మరియు సమాధానాలు, పాఠశాలలో విద్యార్థుల మధ్య తలెత్తిన గొడవల్లో తల్లిదండ్రులు పాఠశాలల్లో ప్రవేశించి ఉపాధ్యాయులపై జరిపే దౌర్జన్యాలు తదితర సమస్యలను ఎదుర్కొంటూ, నరాలు తెగే పని వత్తిడిలో విధులు నిర్వహిస్తున్న ప్రాథమిక ఉపాధ్యాయులపై మళ్ళీ ప్యానల్ తనిఖీల పేరుతో అదనంగా పని వత్తిడి పెంచుతూ తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకే న్యాయం చేయలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక విధంగా చెప్పాలంటే నేడు పాఠశాలల్లో బోధన తప్పా మిగి లిన బాధ్యతలే కీలకంగా మారాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఒకరిద్దరు లేదా ముగ్గురు చొప్పున ఉపాధ్యా యు లతో నడిచే పాఠశాలలో కనీస సామర్థ్యాలు సాధనే దుర్లభంగా మారిందని, ప్యానల్ తనిఖీలు పేరుతో అరకొర ఉపాధ్యాయులతో జరుగుతున్న బోధనలను ఈ ప్యానల్ తనిఖీలు మంచి కన్నా ఎక్కువ నష్టం కలిగిస్తున్నదని వారు తెలిపారు. అలాగే ప్యానల్ టీం లు అంటూ, వందలాది మంది ఉపాధ్యాయులను ఒక సంవత్సరం పాటు పాఠశాలలకు దూరం చేయడం ఎటువంటి శాస్త్రీయ విధానమని వారు ప్రశ్నించారు. ప్రతి ప్రాథమిక పాఠ శాలకు, ఉన్నత పాఠశాలల్లాగే తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున మొత్తం 5 గురు ఉపాధ్యాయులను నియ మించి, అప్పు డు తనిఖీలు నిర్వహించుకోవాలని వారు ప్రభుత్వా నికి సూచిం చారు. అలాగే ఉపాధ్యాయులకు అన్ని రకాల బోధనేతర పనులను తొలగించి, కేవలం బోధనకే పరిమితం చేయాలని వారు కోరారు.

## తెలంగాణ సహ ప్రభారీ శ్రీ అభయ్ పాటిల్‌ని సన్మానించిన జేఎస్ఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 24 :
తెలంగాణ బీజేపీ సహ-ప్రభారీగా నియమితులైన తర్వాత ఈ రోజు మొదటిసారిగా రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్ర యంలో (లక్నో నుండి బెంగళూరు వెళ్తున్న సందర్భంలో) బెల్గావ్ ఎమ్మెల్యే (2004, 2008, 2018, 2023) శ్రీ అభయ్ పాటిల్ ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జేఎస్ఆర్ (జన్నపురెడ్డి సురేం దర్ రెడ్డి)మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

## డీఎస్పీ భీమ్‌రెడ్డి బినామీల ఇళ్లలో ఏసీబీ సోదాలు

- ఈ కేసులో దూకుడు పెంచిన ఏసీబీ అధికార యంత్రాంగం



హైదరాబాద్, సెప్టెంబర్ 24 :
డీఎస్పీ భీమ్ రెడ్డి కేసులో ఏసీబీ దూకుడు పెంచింది. ఆయన బినామీల ఇళ్లలో సోదాలు చేపట్టింది. 8 మంది బినామీల నివాసాల్లో గురువారం అధికారులు తనిఖీలు చేశారు. డీఎస్పీ భీమ్‌రెడ్డి పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. గతంలో అధికారులు ఆయన నివాసాల్లో సోదాలు చేసి భారీగా అక్రమాస్తులు గుర్తించారు. జూలై 2న 16 చోట్ల దాడులు నిర్వహించి, సుమారు రూ. 150-300 కోట్ల విలువైన అక్రమ ఆస్తులను వెలికి తీశారు. ఇందులో విలాసవంతమైన విల్లా, ఫ్లాట్లు, 50 ఎకరాలకు పైగా భూమి, బంగారం, నగదు ఉన్నాయి. అయితే ఆయన బినామీల ద్వారా లావాదేవీలు నిర్వహిం చినట్లు అధికారులు గుర్తించారు. భారీగా నగదు స్వాధీనంఈ మేకు ఊూా భీమ్ రెడ్డికి సంబంధించిన 8 మంది బినామీలను ాాజదీ గుర్తించింది. ACB DSP గంగసాని శ్రీధర్ నేతృత్వంలో హైదరాబాద్‌లోని పుప్పలగూ డలో ఉన్న ఆ బినామీల ఇళ్లపై తాజా గా ఆకస్మిక దాడులు జరుగుతున్నాయి. రాయదుర్గంలోని పంచవటి కాలనీలో కూడా సోదాలు కొనసాగుతున్నాయి. ఆ ఊూాకి సంబంధించిన ఆస్తి పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు. తనిఖీల్లో భారీగా నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

## రసవత్తరంగా రెడ్‌క్రాస్ ఎన్నికలు




హైదరాబాద్, సెప్టెంబర్ 24 :
నామినేషన్ వేసిన జగన్ మోహన్ గౌడ్.. రెడ్‌క్రాస్ ఎన్నికల నామి నేషన్ల ప్రక్రియ రసవత్తరంగా సాగుతోంది. ఈ సందర్భం గా పలు వురు ఔత్సాహికులు తమ నామినేషన్లు దాఖలు చేస్తు న్నారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్ పోస్టుకు..అక్టోబర్ 4వ తేదీన జరగనున్న నిజామాబాద్ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పోటీ చేసేందుకు న్యా యవాది మల్లెపూల జగన్మోహన్‌గౌడ్ ముందుకొచ్చారు. గురువారం రెడ్‌క్రాస్ జిల్లా కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఆయన మాట్లాడుతూ రెడ్ క్రాస్ సేవలను జిల్లాలో ఇంకా మరింత పటిష్టం చేయడం కోసం కృషిచేస్తానన్నారు. సేవా కార్యక్రమాలను విస్తృతం చేయడంతో పాటు ప్రజలకుఎల్లవేళలారక్తాన్ని అందించే విధంగా.. జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు శాయాశక్తులా కృషి చేస్తాన న్నారు. రెడ్‌క్రాస్‌సొసైటీ సభ్యులు తనకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

# మరోసారి దాడి చేస్తే హిందూ మహాసముద్రం వరకు యుద్ధం

- ఇరాన్ సంచలన హెచ్చరిక
- తారా స్థాయికి చేరిన అమెరికా, ఇరాన్ దేశాల మధ్య మాటల యుద్ధం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24:** మెరికా, ఇరాన్ దేశాల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. ఐక్యరాజ్యసమితి వేదికగా ఇరు దేశాలు పరస్పరం తీవ్ర హెచ్చరికలు జూలు విసిరిన వేళ, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ భగ్గుమన్నాయి. ఒకవేళ అమెరికా లేదా ఇజ్రాయెల్ ( ×ంతీుువశ్రీ ) తమపై మరోసారి సైనిక దాడికి దిగితే, ఈ యుద్ధ రంగం హిందూ మహాసముద్రం వరకు విస్తరించవచ్చని ఇరాన్ సుప్రీం లీడర్ సలహాదారు యాహ్యా రహీమ్ సఫావీ హెచ్చరించారు. ఇరాన్ ప్రభుత్వ మీడియా ద్వారా విడుదల చేసిన వీడియో సందేశంలో సఫావీ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్, హార్ముజ్ జలసంధి నుంచి ఎర్ర సముద్రం వరకు పరిమిత మైన ఘర్షణలు.. భవిష్యత్తులో మరింత ముందుకు వెళ్లే అవకాశం ఉందని స్పష్టం చేశారు. అయితే హిందూ మహాసముద్రంలో ఏయే ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుంటారనే దానిపై స్పష్టత ఇవ్వలేదు. మార్చి నెలలో శ్రీలంక తీరానికి సమీపంలో ఇరాన్ యుద్ధనౌకను అమెరికా జలాంతర్గామి ముంచిన ఘటనను ఈ సందర్భంగా పరిశీలకులు గుర్తుచేస్తున్నారు.

### ఇరాన్ అధ్యక్షుడి తిరస్కరణ..

మరోవైపు, ఒప్పందం కుదుర్చుకోకపోతే ఇరాన్‌ను సర్వనాశనం చేస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ తీవ్రంగా తిరస్కరించారు. అమెరికా బెదిరింపులకు, ఒత్తిళ్లకు ఇరాన్ ఎప్పటికీ తలొగ్గదని తేల్చిచెప్పారు. అదే సమయంలో, యుద్ధాన్ని ముగించేందుకు దౌత్యపరమైన చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని, అయితే బలవంతపు ధోరణులను సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

### చమురు రవాణాపై తీవ్ర ప్రభావం..

ప్రపంచ చమురు సరఫరాకు కీలకమైన హార్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో అంతర్జాతీయ మార్కెట్లు అప్రమత్తమయ్యాయి. అమెరికా తన సైనిక ఒత్తిడిని, నౌకాదళ దిగ్బంధనాన్ని ఎత్తివేస్తేనే హార్ముజ్ మార్గాన్ని పూర్తిగా తెరుస్తామని ఇరాన్ షరతులు విధిస్తోంది. ఈ పరిణామాలు భారత్ వంటి దేశాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. పశ్చిమాసియా సంక్షోభం మరింత ముదిరితే చమురు ధరలు, రవాణా వ్యయాలు పెరిగే ప్రమాదముందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యూపీఐ లావాదేవీలపై కేంద్ర ప్రభుత్వం త్వరలో అమలు చేయనున్న కొత్త నిబంధనల నేపథ్యంలో పెట్రోల్ బంక్ డీలర్లకు ఊరట లభించే అవకాశం కనిపిస్తోంది. అక్టోబర్ 15 నుంచి రూ. 2,000 దాటిన యూపీఐ చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ వర్తించనున్న సంగతి తెలిసిందే. అయితే, పెట్రోల్ బంకుల్లో రూ. 2,000కు మించిన యూపీఐ లావాదేవీలను ఎండీఆర్ ఛార్జీల నుంచి పూర్తిగా మినహాయించాలన్న డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం.

డీలర్లకు వచ్చే మార్జిన్లు ..
ఈ మేరకు ఆల్ ఇండియా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ (ూూ×ూణాూ) ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ప్రత్యేకంగా లేఖ రాసింది. పెట్రోల్, డీజిల్ విక్రయాలపై డీలర్లకు వచ్చే మార్జిన్లు పరిమితంగా ఉంటాయని, ప్రతి లావాదేవీపై ఫ్లాట్‌గా రూ. 5 ఎండీఆర్ చెల్లించాల్సి వస్తే తమపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని ఆ సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. డీలర్ల ఈ విజ్ఞప్తిని పెట్రోలియం మంత్రిత్వ శాఖ ద్వారా ఆర్థిక సేవల విభాగం (ఱఖీూ) పరిశీలనకు పంపినట్లు తెలుస్తోంది. దీనిపై త్వరలోనే ఉన్నత స్థాయిలో చర్చించి తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

కొత్త నిబంధనలు ఇవే..వచ్చే నెల అక్టోబర్ 15 నుంచి అమల్లోకి రానున్న కొత్త నిబంధనల ప్రకారం రూ. 2,000 కంటే తక్కువ లావాదేవీలపై ఎలాంటి ఎండీఆర్ ఉండదు. అయితే రూ. 2,000 దాటిన సాధారణ పీ2ఎం (Person-to-Merchant) లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ విధిస్తుండగా, ఇంధన విక్రయాలు, రైల్వే టికెట్లు, ఇన్సూరెన్స్ వంటి ప్రత్యేక రంగాల చెల్లింపులపై ప్రతి లావాదేవీకి ఫ్లాట్‌గా రూ. 5 చొప్పున ఛార్జ్ వర్తిస్తుందని ఎన్‌పీసీఐ (NPCI) ప్రకటించింది. ఈ అదనపు ఛార్జీల భారం కారణం గా ఇప్పటికే పలు ప్రాంతాల్లోని పెట్రోల్ బంక్ డీలర్లు రూ. 2,000కు మించి యూపీఐ చెల్లింపులను నిలిపివేస్తామని హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## పవన్ తో వంగవీటి రాధా ఆకస్మిక భేటీ వెనుక..!?

**హైదరాబాద్, సెప్టెంబర్ 24:** ఏపీలో రాజకీయం ఆసక్తిగా మారుతోంది. స్థానిక ఎన్నికలకు రంగం సిద్ధం అవుతోంది. వచ్చే వారం స్థానిక పోరు షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. అటు కూటమి పార్టీలు.. ఇటు వైసీపీ స్థానిక ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. ఇప్పటికే వైసీపీ నుంచి పలువురు నేతలు కూటమి పార్టీల్లో చేరారు. ఈ సమయంలోనే సీట్ల సర్దుబాటు పైనా చర్చలు సాగుతున్నాయి. కాగా.. ఈ ఎన్నికల వేళ డిప్యూటీ సీఎం పవన్ తో వంగవీటి రాధా భేటీ వెనుక కొత్త చర్చ మొదలైంది. ఏపీలో స్థానిక ఎన్నికల రాజకీయం కీలక మలుపు తిరుగుతోంది. కూటమి పార్టీల మధ్య సీట్ల షేరింగ్ వ్యవహారంలో కొత్త అంశాలు తెర మీదకు వస్తున్నాయి. జనసేన తమకు బలం ఉన్న చోట పోటీ చేయాలనే నిర్ణయానికి వచ్చింది. మిత్రపక్షాలతో సీట్ల సర్దుబాటు సమస్య వస్తే ఫ్రెండ్లీ కంటెస్ట్ కు దిగాలని పవన్ నిర్దేశించారు. ఈ నిర్ణయమే ఇప్పుడు కీలకంగా మారుతోంది. ఇదే సమయంలో పవన్ కల్యాణ్‌తో మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ భేటీ అయ్యారు. మర్యాద పూర్వక భేటీగా జనసేన నేతలు చెబుతున్నారు. ప్రజారాజ్యం పార్టీలో కలిసి పనిచేసిన రోజులను ఇరువురూ గుర్తుచేసుకున్నారని... 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో విజయవాడ పశ్చిమ నియోజక వర్గంలో నిర్వహించిన ప్రచారానికి సంబంధించిన పలు అంశాలను కూడా వారు ప్రస్తావించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. భేటీలో సమకాలీన రాజకీయ పరిణామాలతో పాటు త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై ఇరువురూ చర్చించినట్లు తెలుస్తోంది. పవన్ కల్యాణ్ ప్రస్తుతం బాధ్యతలు నిర్వర్తిస్తున్న శాఖల్లో చేపడుతున్న మార్పులు, సంస్కరణలను రాధాకృష్ణ అభినందించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. అయితే.. విజయవాడ కార్పోరేషన్ మేయర్ పదవి పైన జనసేన ఆశలు పెట్టుకుంది. అటు టీడీపీ నుంచి ముఖ్య నేతలు తమ వారసుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా.. 2019 ఎన్నికల సమయంలో టీడీపీ చేరిన రాధా కు ఎమ్మెల్సీ సీటు పైన హామీ ఇచ్చారు. ఇప్పటికీ ఇంకా అమలు కాలేదు. ఇప్పుడు పవన్ తో భేటీ వెనుక విజయవాడ కార్పోరేషన్ ఎన్నికల్లో రాధా పాత్ర గురించి సోషల్ మీడియాలో చర్చ సాగుతోంది. బెజవాడ మేయర్ గా రాధా కు ఛాన్స్ దక్కుతుందనే చర్చ కొంత కాలంగా వినిపిస్తోంది.

# ప్రణయ్ హత్య కేసులో సంచలనం..

### చర్లపల్లి జైలులో నిందితుడు మృతి

**హైదరాబాద్, సెప్టెంబర్ 24:** నల్గొండ జిల్లాలోని మిర్యాలగూడలో సరిగ్గా 8 సంవత్సరాల క్రితం అంటే 2018లో సంచలనం సృష్టించిన ప్రణయ్ హత్య కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఏ 4 (నాలుగో నిందితుడు) గా ఉన్న అబ్దుల్ బారీ గుండెపోటుతో మృతిచెందాడు. ప్రస్తుతం చర్లపల్లి జైలులో అతడు శిక్షను అనుభవిస్తున్నాడు. అయితే గురువారం ఛాతిలో తీవ్రమైన నొప్పి రావడంతో అధికారులు వెంటనే ఆయన్ని సికింద్రాబాద్ లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రిలోనే ఉంచారు. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఈ కేసులో నల్గొండలోని ప్యారసాభగ్ కాలనీకి చెందిన అబ్దుల్ బారీ చర్లపల్లి జైలులో జీవిత ఖైదు అనుభవిస్తున్నాడు. 2025 మార్చి నెలలో నల్గొండ కోర్టు అతనితో పాటు మరో ఐదుగురికి జీవిత ఖైదు విధించింది. వారిలో ఎంఏ నజీమ్ ఆటో డ్రైవర్, శ్రావణ్ మారుతి రావు తమ్ముడు, సముద్రాల శివ, మహమ్మద్ అస్గర్ అలీ, మహమ్మద్ అబ్దుల్ కరీం లు ఉన్నారు. వీరితో పాటు కాంట్రాక్ట్ కిల్లర్ సుభాష్ కుమార్ శర్మకు మరణశిక్ష విధించింది. అయితే గుజరాత్ మాజీ హోం మంత్రి హరేన్ పాండ్యా హత్య కేసులో బారీని గతంలో అరెస్టు చేసినట్లు సమాచారం. అయితే ఆ కేసులో బారీ నిర్దోషిగా విడుదలయ్యాడు. ఇక మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి వద్ద 2018 సెప్టెంబర్ 14వ తేదీన ప్రణయ్ ను అతి కిరాతకంగా హత్య చేశాడు కాంట్రాక్ట్ కిల్లర్ సుభాష్ కుమార్ శర్మ. అమృతను ప్రణయ్ కులాంతర వివాహం చేసుకున్న క్రమంలో ఆమె తండ్రి మారుతీరావు.. ప్రణయ్ ను హత్య చేయించినట్లు కోర్టు తేల్చింది. ఇక పోలీస్ చార్జ్ షీట్ లోని వివరాల ప్రకారం అబ్దుల్ కరీం, అబ్దుల్ బారీ, అస్గర్ అలీలు కాంట్రాక్ట్ కిల్లర్ సుభాష్ కుమార్ శర్మ సాయంతో ప్రణయ్ ను హత్య చేశారు. ఇందుకు కోటి రూపాయల వరకూ డీల్ కుదిరినట్లు సమాచారం. భార్య అమృతతో కలిసి ఆసుపత్రి నుండి బయటకు వస్తున్న ప్రణయ్ ను శర్మ వెంబడించి కత్తి దాడి చేసి హత్య చేసిన దృశ్యాలు అప్పట్లో సంచలనంగా మారాయి. ఈ కేసు విచారణలో ఉండగానే అమృత తండ్రి మారుతి రావు 2020 మార్చి 8న హైదరాబాద్ లోని



ఖైరతాబాద్ లో గెస్ట్ హౌస్ లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ తర్వాత మిగిలిన నిందితులపై విచారణ కొనసాగించి కోర్టు గత ఏడాది మార్చిలో తుది తీర్పు వెల్లడించింది.

## వివాహేతర సంబంధం పెట్టుకుందని తల్లిని హతమార్చిన కుమారుడు.. ?



**హైదరాబాద్, సెప్టెంబర్ 24:** వరంగల్ రూరల్ జిల్లా కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధి లోని బాలాజీ నగర్‌లో దారుణమైన ఘటన చోటుచేసుకుంది. వివాహేతర సంబంధం పెట్టుకుందన్న కారణంతో కన్న తల్లినే దారుణంగా గొంతు కోసం హతమార్చాడు ఓ యువకుడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు స్పష్టం చేశారు. ఇక మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టు మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. ఇటీవలి కాలంలో సోషల్ మీడియా విని యోగం విపరీతంగా పెరిగిపోయింది. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకూ అంతా గంటల తరబడి ఫోన్ లు చూస్తూ కూర్చోవడం అల వాటుగా మారిపోయింది. ముఖ్యంగా యూట్యూబ్ రీల్స్, ఇన్ స్టా రీల్స్ చూసేందుకు నేటి గృహిణులు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే మితిమీరిన ఇన్ స్టాగ్రామ్ వినియోగం ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. ఆ కుటుంబాన్ని రోడ్డు వేసింది. వివరా ల్లోకి వెళ్తే.. వరంగల్ రూరల్ జిల్లా కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీ నగర్ కు చెందిన నాగుల సుధాకర్, ఉదయశ్రీ దంపతులు. 20ఏళ్ల క్రితం వివాహం చేసుకున్న ఈ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇక సుధాకర్ స్థానిక ప్రైవేట్ కంపెనీలో అటెండర్ గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే భార్య ఉదయశ్రీ ఇన్ స్టా గ్రామ్ లో రీల్స్ చూస్తూ కాలం గడిపేది. ఈ క్రమంలోనే ఇన్ స్టాగ్రామ్ లో నాలుగేళ్ల క్రితం కరీంనగర్ కు చెందిన ఓ వ్యక్తితో ఉదయశ్రీకి పరిచయం ఏర్పడింది. అది వివాహేతర సంబంధానికి దారితీసింది. దాంతో పిల్లల్ని, భర్తను వదిలి వేరే కాపురం పెట్టాలని నిర్ణయించుకున్నారు. అయితే తల్లి చేష్టలను గుర్తించిన కుమారుడు దొరబాబు పలు మార్లు పద్ధతి మార్చుకోవాలని కోరాడు. అయినా కూడా ఉదయశ్రీ వివా హే తర సంబంధం కొనసాగిస్తూనే ఉంది.

ఈ క్రమం లో సదరు వ్యక్తితో కలిసి ఉదయశ్రీ వెళ్లిపోయేందుకు సిద్ధం అవుతుండగా అది గుర్తించిన కుమారు డు దొరబాబు తల్లిని బెడ్ రూంలోకి తీసుకెళ్లి, వివాహేతర సంబంధం వద్దని నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. అయినా తల్లి ససేమిరా అనడంతో కోపాద్రిక్తుడై ఆమె గొంతు కోసి చంపేశాడు. ఆ తర్వాత అక్కడి నుంచి దొరబాబు పరార్ అయ్యాడు. ఇక ఈ హత్యపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## బెంగాల్‌కు అదానీ బిగ్ బూస్ట్..

### లక్ష కోట్ల మెగా ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్..!

**హైదరాబాద్, సెప్టెంబర్ 24:** పశ్చిమ బెంగాల్ ఆర్థిక ప్రగతికి సరికొత్త ఊతం ఇచ్చేలా అదానీ గ్రూప్ భారీ పెట్టుబడుల ప్రణాళికను ప్రకటించింది. రాబోయే పదేళ్ల కాలంలో రాష్ట్రంలో రూ. లక్ష కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టనున్నట్లు అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ వెల్లడించారు. కోల్‌కతాలో నిర్వహించిన ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) కీలక సమావేశంలో ఆయన ఈ ప్రతిపాదనలను పంచుకున్నారు. ఈ పెట్టుబడులు పోర్టులు, లాజిస్టిక్స్, శిలాజేతర ఇంధన వనరులు, రవాణా వ్యవస్థల వంటి అత్యంత ప్రాధాన్యత కలిగిన రంగాలలో విస్తరిస్తాయి. గుజరాత్‌లోని ముంద్రా పోర్టుతో ప్రారంభమైన తన మూడు దశాబ్దాల పారిశ్రామిక ప్రయాణాన్ని ప్రస్తావిస్తూ, పశ్చిమ బెంగాల్ ఇకపై తన రెండో కర్మభూమి కానుందని గౌతమ్ అదానీ



ప్రకటించారు. బెంగాల్ మరే ఇతర రాష్ట్ర నమూనాను అనుకరించాల్సిన అవసరం లేదని, తన సొంత నైపుణ్యాలతోనే దేశంలోనే బలమైన ఆర్థిక శక్తిగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. గ్రీన్ సిమెంట్ ప్లాంట్లు, హైపర్‌స్కేల్ డేటా సెంటర్లు, రోడ్లు, వంతెనల నిర్మాణంతో పాటు వినూత్న రోప్‌వేల అభివృద్ధికి కూడా ఈ నిధులను కేటాయించనున్నారు. ఈ మెగా పెట్టుబడుల ప్రణాళికలో భాగంగా కోల్‌కతా పరిధిలోని న్యూటౌన్‌లో 'అదానీ ఆరోగ్య మందిర్' పేరుతో 2,000 పడకల అత్యాధునిక వైద్య విద్యాసంస్థను ఏర్పాటు చేయనున్నారు. సామాన్య ప్రజలకు కూడా నాణ్యమైన కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో, ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోని సగం పడకలను నిరుపేద రోగుల ఉచిత చికిత్సల కోసం ప్రత్యేకంగా కేటాయించనున్నారు. దీనితో పాటు, బెంగాల్ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడేందుకు కుమార్తులి ఘాట్ పునరుద్ధరణ, చారిత్రక రైటర్స్ బిల్డింగ్ పరిరక్షణ బాధ్యతలను కూడా అదానీ గ్రూప్ చేపట్టనుంది. భవిష్యత్తు ఆర్థిక మార్పులను ఊహించి మౌలిక వసతులను డిమాండ్ కంటే ముందే నిర్మించడమే తమ వ్యాపార సూత్రమని అదానీ పేర్కొన్నారు. కనెక్ట్ చేయబడిన అంతర్గత మౌలిక సదుపాయాల నెట్‌వర్క్ ఎల్లప్పుడూ విడి ఆస్తుల కంటే ఎక్కువ విలువను సృష్టిస్తుందని ఆయన వివరించారు. ఒడిశా, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ వంటి ఖనిజ సంపన్న రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న పశ్చిమ బెంగాల్.. ఈశాన్య రాష్ట్రాలకు వారధిగా, ఆగ్నేయాసియా దేశాలకు ముఖద్వారంగా మారి జాతీయ ప్రగతికి వ్యూహాత్మక కేంద్రంగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## 22ఏ భూములపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం..

### ఆ రిజిస్ట్రేషన్లకు సర్కార్ గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్, సెప్టెంబర్ 24:** 22ఏ నిషేధిత భూముల అంశంపై తాజాగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీ, డీటీసీపీ, హెచ్ ఎండీఏ అనుమతి ఉంటే 22ఏలో ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కొత్త ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని ప్రభుత్వం వెల్లడించింది. ప్రభుత్వ నిర్ణయంతో లక్షలాది మంది ప్లాట్ల యజమానులకు, సామాన్య గృహ వినియోగదారులకు భారీ ఊరట లభించింది. ఇక గత కొన్ని నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా 22 ఏ భూముల అంశంపై వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. గతంలో ఉన్న నిబంధనల ప్రకారం మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖల నుంచి అనుమతులు పొంది ఇళ్లు, స్థలాలను కొనుగోలు చేసినప్పటికీ లక్షలాది మంది ప్లాట్ల యజమానులు, సామాన్య గృహ వినియోగదారులకు చెందిన ఆయా సర్వే నెంబర్లు 22 ఏ నిషేధిత జాబితాలో ఉన్న నేపథ్యంలో క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. అయితే తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వారికి భారీగా ఉపశమనం లభించింది. టెక్నికల్ సమస్యలు లేదా రెవెన్యూ వర్గీకరణ వల్ల 22 ఏ జాబితాలో చేరినప్పటికీ చట్టబద్ధమైన ప్రణాళికా సంస్థల నుంచి అనుమతులు ఉంటే దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రభుత్వ నిర్ణయంతో చాలాకాలంగా స్తంభించి పోయిన స్థిరాస్తి లావాదేవీలు తిరిగి ఊపందుకుంటాయని పలువురు భావిస్తున్నారు. అలాగే ప్రభుత్వ ఖజానాకు కూడా రిజిస్ట్రేషన్ ఛార్జీల రూపంలో భారీగా రాబడి సమకూరే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. మరోవైపు తెలంగాణ శాసనసభలో ఇటీవల 22 ఏ భూముల అంశంపై జరిగిన స్వల్పకాలిక చర్చ అనంతరం రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ కోసం ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జీవో జారీ చేశారు. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఛైర్ పర్సన్ గా వ్యవహరించే ఈ కమిటీలో రాజీవ్ గాంధీ హనుమంతు, సందీప్ కుమార్ ఝా సభ్యులుగా ఉన్నారు.

## మీసేవా కేంద్రాలకు వెళ్ళకుండా ఇంటికే ప్రభుత్వ సర్టిఫికెట్లు..



**హైదరాబాద్, సెప్టెంబర్ 24:** తెలంగాణలో ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేలా ఒక కీలక అడుగు వేసింది తెలంగాణా ప్రభుత్వం. ఇప్పటివరకు వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం మీసేవ కేంద్రాల చుట్టూ తిరుగుతూ గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడే కష్టాలకు చెక్ పెడుతూ.. 'మీ ఇంటికే.. మీ సేవలు' మీసేవ డోర్ డెలివరీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్‌లో ఈ సరికొత్త సేవలను అధికారికంగా ప్రారంభించారు. తొలి దశలో క్యూర్ పరిధిలో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో గ్రామీణ, పట్టణ ప్రాంతా లనే తేడా లేకుండా గతంలో ఏ చిన్న సర్టిఫికే ట్ కావాలన్నా ప్రజలు పడ్డ ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. కుల, ఆదాయ, జనన లేదా మరణ ధ్రువీకరణ పత్రాలు కావాలంటే ఉదయాన్నే మీసేవ కేంద్రాల వద్ద బారులు తీరాల్సి వచ్చేది. దీంతో సమయం, డబ్బు వృథా అయ్యేవి. ముఖ్యంగా రోజువారీ కూలీలు, ఉద్యోగులు పనులు మానుకుని మరీ కేంద్రాల వద్ద వేచి చూడాల్సి వచ్చేది. ముఖ్యం గా వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు, బాలింతలు మీసేవ కేంద్రాలకు నడిచి వెళ్లడం ఎంతో ఇబ్బందికరంగా ఉండేది. కొన్ని సందర్భాల్లో దళారుల ప్రమేయంతో అదనపు ఛార్జీలు చెల్లించాల్సి వచ్చేది. ప్రభుత్వం తాజాగా తెచ్చిన ఈ డోర్ డెలివరీ విధానం ద్వారా ప్రజలకు ఎంతో ఊరట లభించనుంది. ప్రజలు 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి లేదా అధికారిక మీసేవ పోర్టల్ ద్వారా తమకు నచ్చిన సమయానికి స్లాట్ బుక్ చేసుకోవచ్చు. బుకింగ్ ఆధారంగా ఎగ్జిక్యూటివ్ నేరుగా మీ ఇంటికి వచ్చి దరఖాస్తు స్వీకరించి, సేవలు అందిస్తారు. ముఖ్యంగా కేంద్రాలకు రాలేని వృద్ధులు, ఉద్యోగులు, దివ్యాంగులు, మహిళలు, గర్భి ణులు, చిన్నారులకు ఈ సేవలు మారనున్నాయి.

# సీఎం సభను విజయవంతం చేద్దాం..



**నేతన్నల సమస్యలు పరిష్కరిస్తాం..**
**-కార్మికులు, రైతులు, యువత భారీగా తరలిరావాలి**
**-సెప్టెంబర్ 30న అంబేద్కర్ విగ్రహం నుంచి సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పాదయాత్ర**
**-యార్న్ సబ్సిడీ, టెక్స్‌టైల్ పార్కు, శిక్షణ కేంద్రాలు, వర్కర్ టు ఓనర్ షెడ్లపై దృష్టి..**
**-ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 30న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే భారీ బహిరంగ సభను కార్మికులు, నేతన్నలు, రైతులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం సిరిసిల్ల పట్టణంలోని చేనేత, జౌళి కార్యాలయంలో చేనేత కార్మికులు, అసాములు, యజమానులతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సెప్టెంబర్ 30న సాయంత్రం 4 గంటలకు కార్మికులు, నేతన్నలు, రైతులు, యువత అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకోవాలని,అక్కడి నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి సభా ప్రాంగణం వరకు పాదయాత్రగా వెళ్లనున్నట్లు తెలిపారు. సీఎం హెలికాప్టర్ ద్వారా కాలేజ్ గ్రౌండ్‌కు చేరుకున్న అనంతరం సుమారు మూడు కిలోమీటర్ల మేర ప్రజల మధ్య నుంచి సభా ప్రాంగణానికి చేరుకుంటారని అన్నారు.కార్మిక సంఘాలు తమ సమస్యలను లిఖితపూర్వకంగా అందించాలని, సీఎం సభకు వెళ్లే సమయంలోనే వినతిపత్రాలు సమర్పించేలా ఏర్పాట్లు చేస్తామని అన్నారు . నేత కార్మికులు, టెక్స్‌టైల్ కార్మికులు, మున్సిపల్ కార్మికులు, ఆసుపత్రి సిబ్బంది సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.సుమారు 300 మంది కార్మికులకు సంబంధించిన సమస్యలు తన దృష్టికి వచ్చాయని అన్నారు . 2023 తర్వాత రావాల్సిన యార్న్ సబ్సిడీ, టెక్స్‌టైల్ పార్కులోని సమస్యలు, కార్మికులకు వేతనాలు సకాలంలో అందకపోవడం వంటి అంశాలపై యాజమాన్యాలతో సమావేశమై పరిష్కార మార్గాలు అన్వేషిస్తామని అన్నారు .

2016 తర్వాత శిక్షణ కేంద్రాలు అందుబాటులో లేవన్న కార్మికుల సమస్యను కూడా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంబంధిత ఏడీతో ఇప్పటికే మాట్లాడామని, సెప్టెంబర్ 30 తర్వాత కార్మిక సంఘాలతో మరోసారి సమావేశమై శిక్షణ కేంద్రాల ఏర్పాటుపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు .

వర్కర్ టు ఓనర్ పథకానికి సంబంధించిన షెడ్లను మరింత మంది కార్మికులకు అందించాలనే డిమాండ్‌ను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. సిరిసిల్లలో సుమారు 5,600 నుంచి 6,000 మంది కార్మికులు ఉన్నారని, ప్రస్తుతం ఉన్న షెడ్లను దశలవారీగా మరింత మంది కార్మికులకు అందించే అంశాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు.సిరిసిల్ల ఆసుపత్రిని 200 పడకల నుంచి 350 పడకలకు పెంచినా, అందుకు అనుగుణంగా అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సంఖ్య పెరగలేదని కార్మికులు తన దృష్టికి తీసుకొచ్చారని, దీంతో సిబ్బందిపై పనిభారం పెరిగిందని చెప్పారు. ఈ సమస్యను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

సిరిసిల్లలో పేద, కార్మిక కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరైందని, సుమారు 1,500 మంది విద్యార్థులు చదువుకునే అవకాశం ఉండే ఈ పాఠశాలలో సెంట్రల్ సిలబస్ తరహా విద్య అందుబాటులోకి వస్తుందని అన్నారు .

అదేవిధంగా సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరైందని తెలిపారు. ఇందులో సుమారు 2,500 మంది పేద విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య అందించేలా ఏర్పాట్లు చేయనున్నమని అన్నారు.చేనేత కార్మికులకు నిరంతరం పని కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. గత ఏడాది 6.96 కోట్ల మీటర్ల చీరల ఆర్డర్లు అందించామని, ప్రస్తుత సంవత్సరంలో ఇప్పటివరకు 4.66 కోట్ల మీటర్ల ఆర్డర్లు ఇచ్చామని, మరో 2 కోట్ల మీటర్ల చీరల ఆర్డర్లు త్వరలో ఇవ్వనున్నట్లు తెలిపారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్ల వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కూడా ఆయన ప్రస్తావిస్తూ, గత ప్రభుత్వం నుంచి అప్పుల భారం వచ్చినప్పటికీ సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తూ కొత్త పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు .

సెప్టెంబర్ 30న సిరిసిల్లలో జరిగే సీఎం రేవంత్‌రెడ్డి సభను కార్మికులు, నేతన్నలు, రైతులు, పేదలు, యువత తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే వేదికగా వినియోగించుకోవాలని కోరారు. జిల్లా అభివృద్ధి కోసం సభను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇక్కడ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, సిరిసిల్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి , కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జన వేడుకల్లో పోలీసుల సమర్థవంతమైన బందోబస్తు

**ఎల్లారెడ్డిపేటలో ఎలాంటి అవాంఛనీయ సంఘ-టనలకు తావులేకుండా ప్రశాంతంగా నిమజ్జనం**
**డీజే శబ్దాలకు దూరంగా సాంప్రదాయబద్ధంగా వేడుకలు**
**పోలీసు నిబంధనలు పాటించేలా చర్యలు తీసు-కున్న సీఐ వెంకటేష్**
**రెచ్చగొట్టే వాట్సప్ పోస్టులపై పోలీసుల నిఘ**
**ఎల్లారెడిపేట పోలీసుల తీరుపై స్థానికుల ప్రశంసలు**

బలగం టీవీ, ఎల్లారెడ్డి పేట

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గణేష్ నిమజ్జన వేడుకలు శాంతియుత వాతావరణంలో ముగిశాయి. నిమజ్జన కార్యక్రమం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎల్లారెడ్డిపేట పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టి పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. గణేష్ విగ్రహాల ఊరేగింపులు, నిమజ్జన ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు.

పోలీసుల సూచనల మేరకు నిర్వాహకులు, భక్తులు పోలీసు నిబంధనలను పాటిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యంగా అధిక శబ్దంతో కూడిన డీజేలకు దూరంగా ఉండి, భజనలు, సంప్రదాయ వాయిద్యాలతో గణేష్ నిమజ్జన వేడుకలను నిర్వహించడం ప్రత్యేకంగా నిలిచింది. దీంతో నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగింది.



ఎల్లారెడ్డిపేట సీఐ వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఊరేగింపు మార్గాల్లో క్రమశిక్షణ పాటించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసు సిబ్బంది విధులు నిర్వహించారు. నిమజ్జనానికి తరలివచ్చిన భక్తులు, యువత పోలీసుల సూచనలకు సహకరించారు.

వేడుకల సందర్భంగా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండటంతో పాటు, నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు పరిస్థితిని పర్యవేక్షించారు. దీంతో ఎలాంటి ఉద్రిక్తతలకు, అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా కార్యక్రమం సజావుగా ముగిసింది. కొందరు కావాలని వాట్సప్ గ్రూపులో రెచ్చగొట్టే పోస్ట్ లు చేయగా వారిపై నిఘా వేసినట్టు పోలీసులు తెలిపారు.

పండుగల సమయంలో పోలీసుల సూచనలు పాటిస్తే శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా వేడుకలను ఆనందంగా నిర్వహించుకోవచ్చని పోలీసులు పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలో గణేష్ నిమజ్జన వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిపై స్థానికులు అభినందనలు వ్యక్తం చేశారు.

# భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ శాఖ అప్రమత్తం



**వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలి: ఎస్ఈ శ్రీనివాస్**

బలగం టీవీ, ఎల్లారెడ్డి పేట

బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం కారణంగా రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల పాటు మోస్తరు నుండి భారీ, కొన్ని చోట్ల అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ రాజన్న సిరిసిల్ల,సర్కిల్. వర్షాలను ఎదుర్కొనేందుకు పూర్తి సమాయత్తంగా ఉందని సూపరింటెండింగ్ ఇంజనీర్, సిరిసిల్ల తెలిపారు. వినియోగదారులు విద్యుత్ పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

ఈ సందర్భంగా ఎస్ఈ శ్రీనివాస్ మాట్లాడుతూ... విద్యుత్ సిబ్బంది అందరూ క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరా స్థితిని పరిశీలించాలని ఆదేశించారు. వినియోగదారులకు విద్యుత్ సంబంధిత సమస్యలు ఎదురైతే తక్షణమే ఫిర్యాదు చేసేందుకు 24/7 పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. కంట్రోల్ రూమ్ నంబర్ 18004250104 లేదా టోల్ ఫ్రీ నంబర్ 1912 లో సంప్రదించాలని కోరారు.

వర్షాల వల్ల ఎక్కడైనా విద్యుత్ అంతరాయం ఏర్పడితే వెంటనే పరిష్కరించేందుకు వీలుగా విద్యుత్ స్తంభాలు, ఇతర సామగ్రిని సిద్ధంగా ఉంచామని వివరించారు. కొన్ని చోట్ల చెట్లు విరిగిపడి విద్యుత్ తీగలు తెగిపడ్డాయని, వాటిని యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించే పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.

వర్షాకాలంలో పాటించాల్సిన ముఖ్యమైన జాగ్రత్తలు:

- వర్షం కురుస్తున్న సమయంలో తడిసిన విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లు, సపోర్ట్ వైర్లు, ట్రాన్స్ఫార్మర్లు, విద్యుత్ పరికరాలు లేదా తడి గోడలకు ఆనుకుని ఉన్న విద్యుత్ ఉపకరణాలను తాకకండి.
- తెగిపోయిన, వేలాడుతున్న లేదా తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలకు ఎట్టి పరిస్థితుల్లోనూ దగ్గరగా వెళ్లవద్దు, తాకవద్దు.
- ఉరుములు, మెరుపులు సంభవిస్తున్న సమయంలో చెట్ల క్రింద నిలబడకండి. బహిరంగ ప్రదేశాల్లో అవసరం లేకుండా సంచరించవద్దు.

గృహ వినియోగదారులకు:

- తడి చేతులతో స్విచ్‌లు, ప్లగ్‌లు, మీటర్ బోర్డులు, మోటార్లు, గీజర్లు, కూలర్లు, వాటర్ హీటర్లు లేదా ఇతర విద్యుత్ పరికరాలను తాకరాదు.
- సెల్‌ఫోన్ ఛార్జింగ్‌లో ఉండగా ఫోన్‌లో మాట్లాడకండి. ముందుగా ఛార్జర్‌ను తొలగించిన తర్వాత మాత్రమే వినియోగించండి.
- ఇంటి వైరింగ్‌కు తప్పనిసరిగా నాణ్యమైన ఎర్తింగ్ చేయించండి.
- ఐఎస్ఐ (ISI) నాణ్యత ప్రమాణాలు కలిగిన విద్యుత్ పరికరాలు, ప్లగ్గులు, వైర్లు, ఛార్జర్లు మాత్రమే ఉపయోగించండి.
- పాడైన, అతుకులు (జాయింట్లు) ఉన్న, ఇన్సులేషన్ దెబ్బతిన్న వైర్లు వెంటనే మార్చించండి.
- ఇంటి విద్యుత్ మరమ్మతులు స్వయంగా చేయకుండా అర్హత కలిగిన ఎలక్ట్రిషియన్‌తో మాత్రమే చేయించండి.

బట్టలు ఆరబెట్టేటప్పుడు

- ఇనుప (GI) దండెలకు బదులుగా ప్లాస్టిక్ దండెలు ఉపయోగించండి.
- విద్యుత్ సర్వీస్ వైర్లు, మీటర్ బోర్డులు లేదా విద్యుత్ లైన్ల సమీపంలో తడి బట్టలు ఆరబెట్టవద్దు.
- ఇంటి ముందు ఏర్పాటు చేసే రేకులు, ఇనుప నిర్మాణాలు విద్యుత్ వైర్లను తాకకుండా తగిన దూరంలో ఉండేలా చూసుకోండి.

రైతులకు ప్రత్యేక సూచనలు:

రైతు సోదరులారా... మీ పంట ఎంత విలువైనదో, మీ ప్రాణం అంతకంటే విలువైనది.

- వ్యవసాయ మోటార్‌ను ఆన్ చేసే ముందు స్టార్టర్, వైర్లు, స్విచ్‌లు సురక్షితంగా ఉన్నాయో లేదో పరిశీలించండి.
- మోటార్లు, స్టార్టర్లు, GI పైపులు, ఫుట్ వాల్వులు, పంపుసెట్లకు తప్పనిసరిగా సరైన ఎర్తింగ్ చేయించండి.
- అతుకులు లేని నాణ్యమైన సర్వీస్ వైర్లు మాత్రమే ఉపయోగించండి.
- విద్యుత్ మోటార్లు, పైపులు, ఫుట్ వాల్వులు లేదా తడి పరిస్థితుల్లో ఉన్న పరికరాలను నేరుగా తాకవద్దు.
- ట్రాన్స్ఫార్మర్ల వద్ద సొంతంగా ఫ్యూజులు మార్చడం, ఏబీ స్విచ్‌లు ఆపరేట్ చేయడం, కాలిన తీగలు సరిచేయడం వంటి పనులు చేయరాదు.
- మోటార్ల మరమ్మతులు అర్హత కలిగిన ఎలక్ట్రిషియన్‌తో మాత్రమే చేయించండి.
- విద్యుత్ లైన్ల క్రింద ఇనుప పైపులు, స్ప్రింక్లర్ పైపులు ఎత్తేటప్పుడు అత్యంత జాగ్రత్త పాటించండి.
- ట్రాక్టర్లు, హార్వెస్టర్లు నడిపేటప్పుడు విద్యుత్ లైన్లకు తగలకుండా చూసుకోండి.
- వ్యవసాయ భూములకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎలక్ట్రిక్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయవద్దు. ఇది చట్టవిరుద్ధమే కాక ప్రాణాంతకం కూడా.
- చేపల వేట లేదా వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ ప్రవాహాన్ని ఉపయోగించడం తీవ్రమైన నేరం.
- విద్యుత్ లైన్ల క్రింద వ్యవసాయ వ్యర్థాలను కాల్చవద్దు. వేడి కారణంగా లైన్లు తెగి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది.

పిల్లల భద్రత కోసం:

- పిల్లలను విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లు, మీటర్ బోర్డులు, స్విచ్ బోర్డుల వద్ద ఆడనివ్వకండి.

పశువులకాపలాదారులు :

- పశువులను విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లకు కట్టవద్దు.
- పశువులను మేతకు తీసుకెళ్లేటప్పుడు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల సమీపానికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోండి.

విద్యుత్ షాక్ సంభవించినప్పుడు

- విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తిని నేరుగా చేతులతో తాకకండి.
- కర్ర, ప్లాస్టిక్ వంటి విద్యుత్ ప్రసారం చేయని వస్తువులతో బాధితుడిని విద్యుత్ మూలం నుండి వేరు చేయండి.
- వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేసి వైద్య సహాయం అందించండి. నాసిరకం వైరింగ్, నాణ్యతలేని విద్యుత్ పరికరాలు, ఎర్తింగ్ లేకపోవడం, అనధికారిక విద్యుత్ మరమ్మతులు మరియు నిర్లక్ష్యమే చాలా విద్యుత్ ప్రమాదాలకు ప్రధాన కారణాలు. ప్రతి వినియోగదారు విద్యుత్ భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారా ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చు.

"విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండండి... సురక్షితంగా జీవించండి... సురక్షితంగా వ్యవసాయం చేయండి." అని ఎస్ఈ శ్రీనివాస్ వివరించారు



# మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలి..

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ హాస్టల్ లో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ముందుగా అధికారులు, సిబ్బంది హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకొని, వారి హాజరు రిజిస్టర్ పరిశీలించారు.

మెనూ చార్ట్ పరిశీలించి,కిచెన్ గోదాంలో బియ్యం, పప్పులు, కూరగాయలు ఇతర ఆహార పదార్థాలను నాణ్యతను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ఈ రోజు ఆహార పదార్థాలు సిద్ధంగా ఉన్నాయో పరిశీలించారు.

అనంతరం వసతి గదులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. హాస్టల్ ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులు హాస్టల్ లో వసతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రణాళిక ప్రకారం చదవాలని, అనుకున్న లక్ష్యం చేరుకోవాలని ఆకాంక్షించారు.

# 108 అంబులెన్స్‌ల ఆకస్మిక తనిఖీ..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:



రాజన్న సిరిసిల్ల జిల్లాలో 108 అంబులెన్స్‌లు, 102 అమ్మఒడి వాహనాలను తెలంగాణ రాష్ట్ర 108 అత్యవసర సేవల ఆడిటింగ్ అధికారి వెంకటేష్, జిల్లా మేనేజర్ సవనపల్లి అరుణ్‌కుమార్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్‌లలో అందిస్తున్న అత్యవసర వైద్య సేవలు, పరికరాల పనితీరు, మందుల లభ్యతను పరిశీలించారు.

అంబులెన్స్‌లలోని వెంటిలేటర్, మానిటర్, ఇన్ఫ్యూషన్ పంప్, ఏఈడీ, అంబు బ్యాగ్, సక్షన్ ఆపరేటర్, ఇంక్యుబేటర్ తదితర అత్యవసర వైద్య పరికరాల పనితీరును అధికారులు తనిఖీ చేశారు. అలాగే ఆక్సిజన్ నిల్వలు, అత్యవసర ఇంజక్షన్లు, మందులు అందుబాటులో ఉన్నాయా లేదా పరిశీలించారు. వాహనాల్లో నిర్వహిస్తున్న రికార్డులు, పరికరాల వివరాలు, నిర్వహణకు సంబంధించిన అంశాలను కూడా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

అత్యవసర వైద్య పరికరాల్లో ఏదైనా మరమ్మతు అవసరమైతే వెంటనే జిల్లా అధికారులకు సమాచారం అందించి, ఆలస్యం చేయకుండా మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. అత్యవసర సమయాల్లో అవసరమయ్యే మందులు, ఇంజక్షన్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.108 అంబులెన్స్ సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు నిరంతరాయంగా మెరుగైన అత్యవసర వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ తనిఖీల్లో 108 సిబ్బంది పెద్ది శ్రీనివాస్, వడ్నాల అనిల్‌కుమార్, పోచంపల్లి పరశురాములు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# సీఎం సభను విజయవంతం చేయండి..

**-కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పర్శ హన్మాండ్లు**

బలగం టీవీ, గంభీరావుపేట :

ఈ నెల 30న సిరిసిల్ల బైపాస్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భారీ బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పర్శ హన్మాండ్లు పిలుపునిచ్చారు. గురువారం శ్రీగాథ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ముగ్గురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పర్శ హన్మాండ్లు మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ పేదల పాలిట వరం వంటిదని అన్నారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న నిరుపేదలు ప్రభుత్వం అందిస్తున్న ఈ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో పేదలకు రూ.10 లక్షల వరకు వైద్యసేవలు అందుతున్నాయని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేసిందని పేర్కొన్నారు.ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లాకు రావడం జిల్లా ప్రజలకు ముఖ్యమైన సందర్భమని అన్నారు. సీఎం పర్యటనతో జిల్లాలోని పెండింగ్ సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సీఎం సభను విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బందెల రాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు వేముల శ్రీనివాస్‌గౌడ్, తొండ్ల దేవేంద్ర, నర్సింలు, నాయకులు పర్శ శ్రీనివాస్, తొండ్ల ప్రసాద్, వేముల రమేష్‌గౌడ్, వేముల గంగాగౌడ్, ఏవన్ తదితరులు పాల్గొన్నారు.




# మల్లారెడ్డిపేట అమ్మాయి అదుర్స్.. జాతీయ క్రికెట్ పోటీలకు ఎంపిక

**-జమ్మూకాశ్మీర్‌లో జరిగనున్న పోటీలు**
**- ఘనంగా సన్మానించిన జేఏసీ**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

గ్రామీణ ప్రాంతానికి చెందిన యువ క్రీడాకారిణి జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికై రాజన్న సిరిసిల్ల జిల్లాకు గుర్తింపు తీసుకురావడం అభినందనీయమని తెలంగాణ ఉద్యమకారుల రాజన్న సిరిసిల్ల జిల్లా జేఏసీ చైర్మన్ గజ్జెల దేవరాజ్ అన్నారు. గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటకు చెందిన బత్తుల అక్షర జమ్మూకాశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన సందర్భంగా సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ ఆధ్వర్యంలో అక్షర ను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా గజ్జెల దేవరాజ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో ఉండి క్రీడల్లో ప్రతిభ కనబరుస్తూ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం అక్షర పట్టుదలకు నిదర్శనమన్నారు. మల్లారెడ్డిపేట వంటి గ్రామం నుంచి జాతీయ స్థాయికి ఎదగడం జిల్లాలోని క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.అక్షర క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు తనవంతుగా ఉచిత క్రికెట్ కిట్‌ను అందజేస్తానని తెలిపారు. అక్షర మరింత ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు.గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ ఉన్న క్రీడాకారులు ఉన్నారని, వారికి సరైన ప్రోత్సాహం, శిక్షణ, క్రీడా సామగ్రి అందిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరింత మంది రాణించే అవకాశం ఉందన్నారు.జమ్మూకాశ్మీర్‌లో జరగనున్న జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో అక్షర ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, ఉద్యమ నాయకులు, పలువురు పాల్గొన్నారు.

# సూపర్ ఎల్ నినోతో 4.5 లక్షల మరణాలకు అవకాశం..!

## ఉష్ణోగ్రతల కారణంగా భారత్‌లో 15,800 మంది మృతి చెందే అవకాశం

## ప్రభుత్వాలు అత్యవసర చర్యలు చేపట్టాలని యూనివర్సిటీ ఆఫ్ షికాగో అధ్యయనం హెచ్చరిక

బలగం టీవీ, హైదరాబాద్

సూపర్ ఎల్ నినో ప్రభావంతో రానున్న ఆరు నెలల్లో ప్రపంచవ్యాప్తంగా 4,51,000 మంది మరణించే అవకాశం ఉందని యూనివర్సిటీ ఆఫ్ షికాగో అధ్యయనం హెచ్చరించింది. ఇందులో ఉష్ణోగ్రతల సంబంధిత కారణాలతో భారత్‌లో 15,800 మంది ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని పేర్కొంది.

భారత్‌లో నమోదయ్యే మరణాల్లో సుమారు సగం డిసెంబర్ నుంచి ఫిబ్రవరి మధ్య సంభవించే అవకాశం ఉందని అధ్యయనం తెలిపింది. వేసవి కాలంలో ఈ సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఎల్ నినో ప్రభావంతో రానున్న నెలల్లో ప్రపంచ భూ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1.2 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉండవచ్చని పేర్కొంది.

ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు అత్యవసర స్పందన చర్యలు చేపట్టాలని అధ్యయనం సూచించింది. ఉష్ణోగ్రత హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేయడం, బలహీన వర్గాలకు ఆరోగ్య సేవలు అందించడం, శీతలీకరణ కేంద్రాలు, తాగునీటి కేంద్రాలు ఏర్పాటు చేయడం, కార్మికుల భద్రతకు చర్యలు తీసుకోవడంతో పాటు ఆరోగ్య వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచాలని సూచించింది.

# అఫ్గానిస్థాన్‌పై పాకిస్థాన్ దాడులు

## తీవ్రస్థాయికి పాక్-అఫ్గాన్ సరిహద్దు ఉద్రిక్తతలు!

## అఫ్గాన్‌లోని 10 సైనిక ప్రాంతాలపై పాక్ వైమానిక దాడులు.. ఖండించిన భారత్!

## స్వీయ రక్షణ కోసమే దాడి చేశామన్న పాకిస్థాన్; పౌరుల మరణాలపై ఐరాస తీవ్ర ఆందోళన

బలగం టీవీ, హైదరాబాద్



పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చాయి. అఫ్గాన్ భూభాగం నుండి తమ గగనతలంలోకి ప్రవేశించిన డ్రోన్లకు ప్రతీకారంగా, గురువారం తెల్లవారుజామున అఫ్గానిస్థాన్‌లోని 10 ప్రావిన్సులలో డ్రోన్ నిల్వ కేంద్రాలు, సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని వైమానిక దాడులు చేసినట్లు పాకిస్థాన్ ప్రకటించింది. తమ గగనతలానికి ముప్పుగా మారిన 8 అఫ్గాన్ డ్రోన్లను టోర్ఖమ్, కోహట్ సమీపంలో కూల్చివేశామని, ఇది స్వీయ రక్షణ హక్కులో భాగంగా చేపట్టిన పరిమిత చర్య అని పాక్ సమాచార మంత్రి అత్తావుల్లా తారార్ వాదించారు. అయితే కాబుల్ నుండి ఈ ఆరోపణలపై ఇంకా ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.

తాజా దాడులకు కొద్ది రోజుల ముందే, సెప్టెంబర్ 21న అఫ్గానిస్థాన్‌లోని పక్తికా, కునార్ ప్రాంతాలపై పాకిస్థాన్ వైమానిక దాడులు నిర్వహించగా, ఇందులో ముగ్గురు పౌరులు మరణించినట్లు అఫ్గాన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ వెల్లడించారు. సరిహద్దు హింస కారణంగా పౌరులు తీవ్రంగా నష్టపోతున్నారని ఐక్యరాజ్యసమితి (UNAMA) ఆందోళన వ్యక్తం చేసింది. 2026 ఏప్రిల్ నుండి జూన్ మధ్య సరిహద్దు ఘర్షణలు మరియు పాక్ వైమానిక దాడుల వల్ల అఫ్గానిస్థాన్‌లో 57 మంది పౌరులు మరణించారని, మరో 342 మంది తీవ్రంగా గాయపడ్డారని ఐరాస తన నివేదికలో స్పష్టం చేసింది.

**పొరుగు దేశంపై పాకిస్థాన్ దురాక్రమణ ప్రాంతీయ శాంతికి తీవ్ర విఘాతం!**

**విదేశాంగ ప్రతినిధి రణధీర్ జైస్వాల్**

అఫ్గానిస్థాన్‌లోని కునార్, పక్తికా ప్రావిన్సులపై పాకిస్థాన్ నిర్వహించిన వైమానిక దాడులను భారతదేశం తీవ్రంగా ఖండించింది. న్యూఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ, ఒక సార్వభౌమాధికార దేశంపై ఇటువంటి సైనిక చర్యలు ప్రాంతీయ శాంతి, భద్రతలకు తీవ్ర భంగం కలిగిస్తాయని పేర్కొన్నారు. అఫ్గానిస్థాన్ స్వాతంత్ర్యం, సార్వభౌమాధికారం మరియు అక్కడి ప్రజల సంక్షేమానికి భారతదేశం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేస్తూ, ఈ దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన అమాయక పౌరుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.

ఉగ్రవాదాన్ని పూర్తిగా అణచివేస్తామంటూ పాకిస్థాన్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ చేసిన ప్రకటనపై విదేశాంగ ప్రతినిధి స్పందిస్తూ, ప్రపంచం తమ మాటలను నమ్మాలంటే పాకిస్థాన్ కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా సరిహద్దు ఉగ్రవాదంపై ఆచరణాత్మకమైన, నమ్మదగిన చర్యలు చూపించాలని హితవు పలికారు. అలాగే సింధు జలాల ఒప్పందంపై చట్టవిరుద్ధంగా ఏర్పాటైన కోర్టు ఇచ్చే నిర్ణయాన్ని శాశ్వత మధ్యవర్తిత్వ న్యాయస్థానం (PCA) తీర్పుగా ప్రచారం చేస్తూ పాకిస్థాన్ వాస్తవాలను వక్రీకరిస్తోందని విమర్శించారు. ఇదే సమావేశంలో రష్యా-ఉక్రెయిన్ వివాదంపై మాట్లాడిన జైస్వాల్, భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ ఉక్రెయిన్ విదేశాంగ మంత్రితో భేటీ అయ్యారని, చర్చలు మరియు దౌత్యం ద్వారానే ఈ సంక్షోభానికి శాంతియుత పరిష్కారం లభిస్తుందని భారత్ ఆశిస్తున్నట్లు తెలిపారు. అలాగే పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌తో సానుకూల, అభివృద్ధి పూరిత సంబంధాలను కాంక్షిస్తున్నామని, ద్వైపాక్షిక అంశాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికి భారత్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

# మెరుగైన భవిష్యత్తు కోసం కలిసి పనిచేద్దాం

## ట్రంప్, జిన్‌పింగ్ భేటీలో వాణిజ్యం, ఏఐ, ఇరాన్ యుద్ధంపై చర్చలు

## పోటీ ఉండొచ్చు.. ఘర్షణకు తావివ్వొద్దన్న చైనా అధ్యక్షుడు

బలగం టీవీ, హైదరాబాద్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ గురువారం వైట్‌హౌస్‌లో సమావేశమయ్యారు. కృత్రిమ మేధ, ఇరాన్ యుద్ధం, అమెరికా రైతులకు చైనా మార్కెట్ అందుబాటు, వాణిజ్యం తదితర అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. రెండు దేశాల ప్రజలకు మెరుగైన భవిష్యత్తును నిర్మించేందుకు కలిసి పనిచేస్తామని ట్రంప్ పేర్కొన్నారు.

వైట్‌హౌస్‌లో అధికారిక స్వాగత కార్యక్రమం అనంతరం ఇరువురు నేతలు ఓవల్ కార్యాలయంలో ప్రతినిధులతో కలిసి చర్చలు జరిపారు. 2016లో తొలిసారి అధ్యక్షుడైనప్పటి నుంచి జిన్‌పింగ్‌తో పరస్పర గౌరవంతో కూడిన మంచి సంబంధాలు కొనసాగుతున్నాయని ట్రంప్ అన్నారు. రెండుదేశాల ఉమ్మడి ప్రయోజనాలపై దృష్టి పెడితే మరిన్ని ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు.

జిన్‌పింగ్ మాట్లాడుతూ అమెరికా, చైనా శాంతియుతంగా సహజీవనం చేయాలని అన్నారు. రెండు ప్రధాన దేశాలు పరస్పర సహకారంతో ప్రయోజనం పొందుతాయని, ఘర్షణతో ఇరువురూ నష్టపోతారని పేర్కొన్నారు. పోటీ అనేది ఆరోగ్యకరంగా, పరిమితుల్లో ఉండాలని, ఒకరితో ఒకరు పోరాడటం కాకుండా ముందుకు సాగేందుకు పోటీ పడాలని అన్నారు.

ఏఐపై మానవ నియంత్రణ

కృత్రిమ మేధ అభివృద్ధి, నిర్వహణలో అమెరికా, చైనాలకు బాధ్యత ఉందని జిన్‌పింగ్ అన్నారు. ఏఐ ఎల్లప్పుడూ మానవ నియంత్రణలో ఉండేలా చూడాలని పేర్కొన్నారు. తైవాన్ అంశంలో చైనా వైఖరి స్పష్టంగా ఉందని, అమెరికా తమ దేశ ఐక్యత, ప్రాదేశిక సమగ్రతకు సంబంధించిన అంశాలను జాగ్రత్తగా పరిగణించాలని కోరారు.

ఇరాన్ యుద్ధం, తైవాన్, అరుదైన ఖనిజాల వాణిజ్యం, వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ ప్రాప్తి వంటి అంశాలు కూడా చర్చల్లో ఉన్నాయని అంతర్జాతీయ వార్తా సంస్థలు పేర్కొన్నాయి. అమెరికా రైతులు సోయాబీన్, ధాన్యాలు, మాంస ఉత్పత్తుల ఎగుమతులకు చైనా నుంచి మరింత మార్కెట్ అవకాశాలను కోరుతున్నారు.

ఇదిలా ఉండగా, ఇరుదేశాల మధ్య గత ఏడాది ఏర్పడిన వాణిజ్య సంధిని కొనసాగించే అంశంపై కూడా చర్చలు జరిగాయి. ట్రంప్, జిన్‌పింగ్ భేటీ సందర్భంగా వాణిజ్యం, సాంకేతికత, ఏఐ అంశాలు కీలకంగా మారాయి.

# అప్పుల ఊబిలో ఉన్న దేశం అభివృద్ధిపై దృష్టి పెట్టాలి..



## పరాయి భూభాగాలపై ఆశలు మానాలి!

## ఐరాస మానవ హక్కుల మండలిలో పాక్ నిరసనలు, మైనారిటీల వేధింపులను ఎండగట్టిన భారత రాయబారి క్షితిజ్ త్యాగి

బలగం టీవీ, హైదరాబాద్

ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి (UNHRC) సమావేశంలో పాకిస్థాన్‌పై భారత్ నిప్పులు చెరిగింది. అప్పులు మరియు బెయిలౌట్‌ల సహాయంతో నడుస్తున్న పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవడంపై దృష్టి పెట్టకుండా, పరాయి భూభాగాలను ఆక్రమించుకోవడం మరియు ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం సరికాదని భారత్ తీవ్ర స్థాయిలో విమర్శించింది. ఐరాసలో భారత దౌత్యవేత్త క్షితిజ్ త్యాగి 'రైట్ ఆఫ్ రిప్లై' ద్వారా పాకిస్థాన్ కుట్రలను, ద్వంద్వ ప్రమాణాలను అంతర్జాతీయ వేదికపై ఎండగట్టారు.

ఐరాస సమావేశంలో భారత దౌత్యవేత్త క్షితిజ్ త్యాగి మాట్లాడిన ప్రధాన ముఖ్యాంశాలు:

ఉగ్రవాదం - ఆర్థిక సంక్షోభం: పాకిస్థాన్ తన వద్ద ఉన్న వనరులను ఉగ్రవాదాన్ని ఎగుమతి చేయడానికి లేదా మండలిలో నాటకాలు ఆడటానికి ఉపయోగిస్తోందని, కానీ ఇవేవీ ఆ దేశం తీసుకున్న అప్పులను తీర్చలేవని త్యాగి ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా పాకిస్థాన్ తన ప్రజల సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి పెడితే మంచిదని హితవు పలికారు.

పాక్ ఆక్రమిత కాశ్మీర్ (PoK) లో మానవ హక్కుల ఉల్లంఘన: జూన్ నెల నుండి పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో జరుగుతున్న నిరసనల్లో అనేకమంది పౌరులు ప్రాణాలు కోల్పోయారని, విద్యార్థులను అరెస్టు చేశారని మరియు అక్కడి ప్రజలకు ఆహారం, ఇంధనం, మందుల వంటి అత్యవసర సరఫరాలను పాక్ ప్రభుత్వం నిలిపివేసిందని తెలిపారు. మానవ హక్కుల మండలి పరిశీలనకు ఏ దేశమైనా పూర్తి అర్హత కలిగి ఉందంటే అది పాకిస్థానేనని అన్నారు.

జమ్మూ కాశ్మీర్ భారత్‌లో అంతర్భాగం: జమ్మూ కాశ్మీర్ ఎప్పటికీ భారతదేశంలో అంతర్భాగమేనని, పాకిస్థాన్ అక్రమంగా ఆక్రమించిన ప్రాంతాలను తక్షణమే ఖాళీ చేయాలని స్పష్టం చేశారు. 1990లో కాశ్మీరీ పండిట్లను తమ సొంత ఇళ్ల నుంచి తారిమి కొట్టడానికి పాక్ శిక్షణ ఇచ్చిన ఉగ్రవాదులే కారణమని, అదే ఉగ్రవాదం వేలాది మంది ముస్లింలను, ఇతర మతస్తులను పొట్టనబెట్టుకుందని గుర్తుచేశారు.

సింధు నదీ జలాల ఒప్పందంపై విదేశాంగ శాఖ స్పందన: సింధు నదీ జలాల ఒప్పందానికి సంబంధించి 'పర్మనెంట్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్' పేరుతో పాకిస్థాన్ చేస్తున్న ప్రచారాన్ని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తోసిపుచ్చారు. అది చట్టవిరుద్ధంగా ఏర్పాటైన కోర్టు ఇచ్చే తీర్పు మాత్రమేనని, అసత్యాలను ప్రచారం చేయడం పాకిస్థాన్‌కు అలవాటుగా మారిందని వ్యాఖ్యానించారు.


balagamtv100@gmail.com



# ఆపన్నులకు అండగా.. 'నా కలం అక్షర సత్యం ఫౌండేషన్'

- నిరుపేద కుటుంబానికి నిత్యావసర సాయం..
- మానవత్వం చాటుకున్న ఫౌండేషన్ సభ్యులు..

బలగం టీవీ, కొనరావుపేట :

కొనరావుపేట మండలం వట్టిమల్ల గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన కొమ్ము నర్సయ్య ఇటీవల మృతిచెందడంతో వారి భార్య నర్సవ్వ కుటుంబం విషాదంలో మునిగిపోయింది. ఈ నేపథ్యంలో 'నా కలం అక్షర సత్యం ఫేస్బుక్ పేజీ ఫౌండేషన్' ఆధ్వర్యంలో కుటుంబానికి అండగా నిలిచారు. ఫౌండేషన్ తరఫున 50 కేజీల బియ్యంతో పాటు 10 రకాల నిత్యావసర సరుకులను గ్రామ సర్పంచ్ గుండా వెంకటేష్ గౌడ్, మానాల ఉప సర్పంచ్ దాసరి అశోక్, గ్యారె శేఖర్, వడ్డేపల్లి రాజేందర్ చేతుల మీదిగా కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం నర్సయ్య కుటుంబాన్ని పరామర్శించి, వారి దుఃఖంలో భాగస్వాములై ప్రగాఢ సానుభూతి తెలిపారు. కష్టకాలంలో నిరుపేద కుటుంబానికి అండగా నిలవడం ద్వారా ఫౌండేషన్ మానవత్వాన్ని చాటుకుంది. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా ఉంటామని నా కలం అక్షర సత్యం ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొమ్ము దేవరాజు, కొమ్ము రాజు, చెప్పాలా స్వామి తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్‌కు ప్రజల్లో కౌంట్‌డౌన్ మొదలైంది

## బీఆర్ఎస్ వేములవాడ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు

బలగం టీవీ, వేములవాడ



34 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను చూసిన ప్రజలు ఆ పార్టీకి కౌంట్‌డౌన్ ప్రారంభించారని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. సిరిసిల్లలో సీఎం రేవంత్‌రెడ్డి సభ అనంతరం ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. వేములవాడలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఇబ్బందులు పడుతున్నా సాగునీరు, విద్యుత్, ఎరువుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వేములవాడ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని, ఎత్తిపోతల ద్వారా రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. మధ్యమానేరు జలాశయంలో నీరు అందుబాటులో ఉన్నందున మల్కాపేట రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోసి రైతులను ఆదుకోవాలని కోరారు. యూరియా పంపిణీని జిల్లా యూనిట్‌గా నిర్వహించడం వల్ల రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని విమర్శించారు. గత యాసంగిలో రైతులు పండించిన పంటలను కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఆది శ్రీనివాస్ స్వగ్రామం రుద్రంగిలో అభివృద్ధి పనులు పూర్తికాలేదని చల్మెడ విమర్శించారు. 30 పడకల ఆస్పత్రి, పోలీస్‌స్టేషన్ భవనాల నిర్మాణం జాప్యమవుతోందని అన్నారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి పనుల్లో ముందుచూపు లోపించిందని ఆరోపించారు.

**'సిరిసిల్ల కేటీఆర్ అడ్డా'**

సిరిసిల్లలో కేటీఆర్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభమవుతుందని చెప్పడం సరికాదని, అక్కడ జరిగిన అభివృద్ధిని చూడాలని చల్మెడ అన్నారు. వైద్య, వ్యవసాయ, నర్సింగ్ కళాశాలలు, జేఎన్‌టీయూ, అపెరల్ పార్క్ వంటి సంస్థలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు.

సమావేశంలో బీఆర్ఎస్ వేములవాడ రూరల్ మండల అధ్యక్షుడు గోస్కుల రవి, నాయకులు రామతీర్థపు రాజు, ఏశ తిరుపతి, క్రాంతికుమార్, గడ్డం హనుమాన్లు, నిమ్మశెట్టి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ పంటల కొనుగోలు పకడ్బందీ ప్రణాళిక ప్రకారం చేయాలి

## - కలెక్టర్ గరిమ అగ్రవాల్

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:



ఖరీఫ్ సీజన్ లో వివిధ పంటల కొనుగోళ్లు పకడ్బందీ ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ 2026- 2027 కొనుగోళ్ల కోసం చేయాల్సిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

వ్యవసాయ శాఖ అధికారుల అంచనా మేరకు దాదాపు 2,40,000 మెట్రిక్ టన్నుల సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లాలో అక్టోబర్ చివరి వారం నుంచి వరి ధాన్యం మార్కెట్లోకి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారని తెలిపారు.

లారీల కాంట్రాక్టర్లు తాము అగ్రిమెంట్ ప్రకారం వాహనాలు అందుబాటులో పెట్టేలా చూడాలని, అన్నిటికి జీపీఎస్ యంత్రాలు ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. కొనుగోళ్లకు అనుగుణంగా గన్ని సంచులు తెప్పించాలని సూచించారు. 4335 టార్పాలిన్లు, ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లు 2, గ్రైన్ కాలిపర్స్ 270, తేమ యంత్రాలు 333, ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాలు 630, హస్క్ రిమూవర్లు 270, డ్రైయర్స్ 2 ఉన్నాయని తెలిపారు.

జిల్లాలో 50 వేల ఎకరాలకు పైగా పత్తి సాగు అవుతుందని, 4 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఆయా శాఖల అధికారులు కొనుగోలు కోసం ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో డీసీఎస్ఓ బుచ్చిబాబు, డీఎం గోపాల్, వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రకాష్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి



## - కలెక్టర్ గరిమ అగ్రవాల్

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో డీఆర్డీఓ, హౌసింగ్ అధికారులు, ఎంపీడీఓలు, ఏఈలతో నిర్వహించిన సమీక్షలో ఇళ్ల నిర్మాణ పురోగతిని మండలాల వారీగా పరిశీలించారు.జిల్లాలో ఇప్పటివరకు 6,339 ఇళ్లకు ముగ్గు పోయగా, 5,294 బేస్‌మెంట్, 4,756 గోడల స్థాయి, 4,467 స్లాబ్ స్థాయికి చేరుకున్నాయని, 3,832 ఇళ్లు పూర్తయ్యాయని తెలిపారు. ప్రతి దశలో పనులు వేగవంతం చేసి ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. అలాగే రెండో విడత ఇళ్ల మంజూరు, పురోగతిని పరిశీలించాలని ఆదేశించారు.

చేయూత పెన్షన్ల దరఖాస్తుల పరిశీలనను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రయోజనం అందేలా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ వైద్య సేవలను విస్తృతంగా అందించాలి**

ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు విస్తృతంగా అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత కలెక్టరేట్‌లో సీజనల్ వ్యాధులు, ఇమ్యూనైజేషన్, ఎన్‌సీడీ స్క్రీనింగ్, మొబైల్ ఎక్స్‌రే, టీబీ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ గర్భిణుల ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్‌ను సజావుగా చేపట్టాలని, పోషకాహారం, ఐరన్ మందులు అందేలా చూడాలని సూచించారు. ఇమ్యూనైజేషన్‌ను 100 శాతం పూర్తి చేయాలని, ప్రతి మంగళవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో '10 నిమిషాలు' కార్యక్రమంలో వైద్యులు పాల్గొని పిల్లలను పరీక్షించాలని ఆదేశించారు. పోషకాహార లోపం, ఎదుగుదల సమస్యలు ఉన్న పిల్లలను గుర్తించి ఆర్‌బీఎస్‌కే ద్వారా ప్రత్యేక వైద్య సేవలు అందించాలని తెలిపారు.అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో మంగళవారం, శుక్రవారం డ్రై డే నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో 531 టీబీ కేసులు ఉన్నాయని, లక్షణాలు ఉన్నవారిని ముందుగానే గుర్తించి చికిత్స అందించాలని సూచించారు. ఎన్‌సీడీ, క్యాన్సర్ స్క్రీనింగ్‌తో పాటు అవసరమైన చోట మొబైల్ ఎక్స్‌రే సేవలను వినియోగించాలని కలెక్టర్ ఆదేశించారు.

సమావేశంలో డీఎంహెచ్‌వో ఏంజెలా ఆల్ఫ్రెడ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్, డీసీహెచ్ఎస్ సుభాషిణి, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఐదో రోజు 5 పతకాలు కైవసం..

**అథ్లెటిక్స్, రోయింగ్, వుషులలో మెరిసిన భారత అథ్లెట్లు!**

**కబడ్డీలో సెమీస్ చేరి పతకం ఖాయం చేసిన భారత్; హాకీలో కొరియాపై 8-2తో భారీ విజయం**

బలగం టీవీ, హైదరాబాద్

జపాన్‌లోని నగోయా వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడలు 2026లో భారత క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకుంటున్నారు. పోటీల ఐదో రోజు (సెప్టెంబర్ 24, 2026) అథ్లెటిక్స్, వుషు, రోయింగ్ మరియు షూటింగ్ విభాగాల్లో అద్భుత ప్రదర్శన చేసిన భారత అథ్లెట్లు మొత్తం 5 పతకాలను సొంతం చేసుకున్నారు. దీంతో టోర్నీలో ఇప్పటివరకు భారత్ సాధించిన మొత్తం పతకాల సంఖ్య 17కు చేరింది.

ఐదో రోజు అథ్లెటిక్స్ మిక్స్ 4x400 మీటర్ల రిలేలో భారత జట్టు అద్భుత ప్రదర్శనతో రజత పతకాన్ని సాధించగా, వుషు విభాగంలో రోషిబినా దేవి నాఓరెమ్ రజత పతకంతో మెరిసింది. అలాగే రోయింగ్ పురుషుల డబుల్ స్కల్స్ విభాగంలో సత్నామ్ సింగ్, సల్మాన్ ఖాన్‌ల జోడీ కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. వీటితో పాటు అథ్లెటిక్స్ 10,000 మీటర్ల రేసులో సీమా, మిక్స్ స్కీట్ ఈవెంట్లో అనంత్‌జీత్ సింగ్ నరుకా-పరినాజ్ ధాలివాల్ జోడీ భారత్‌కు కాంస్య పతకాలను అందించారు.

టీమ్ ఈవెంట్లలోనూ భారత్‌కు శుభపరిణామాలు ఎదురయ్యాయి. పురుషుల హాకీ పూల్ మ్యాచ్‌లో భారత్ 8-2 తేడాతో దక్షిణ కొరియాను చిత్తు చేసి ఘన విజయం సాధించింది. మరోవైపు భారత పురుషుల కబడ్డీ జట్టు అద్భుతమైన ఆటతీరుతో సెమీఫైనల్‌కు అర్హత సాధించి మరొక పతకాన్ని ఖాయం చేసుకుంది. అయితే ఫెన్సింగ్ విభాగంలో మాత్రం భారత క్రీడాకారులకు నిరాశే ఎదురైంది.

ఆసియా క్రీడలు 2026లో ఇప్పటివరకు భారత్ సాధించిన 17 పతకాల జాబితాలో మహిళల క్రికెట్ జట్టు సాధించిన స్వర్ణ పతకంతో పాటు షూటింగ్, వెయిట్‌లిఫ్టింగ్ (మీరాబాయి చాను), బ్యాడ్మింటన్, సాఫ్ట్ టెన్నిస్ మరియు మార్షల్ ఆర్ట్స్ విభాగాలలో లభించిన రజత, కాంస్య పతకాలు ఉన్నాయి.






## అండర్-15 ఆసియాకప్‌లో పాల్గొననున్న సాయివర్షిని..

**అభినందించిన సీపీ శ్వేత!**

**చైనా వేదికగా అక్టోబర్ 12 నుంచి 18 వరకు పోటీలు..**

**వరంగల్ గర్వకారణమన్న సీపీ**

బలగం టీవీ, హైదరాబాద్

చైనాలో జరగనున్న 5వ అండర్-15 ఉమెన్స్ సాఫ్ట్‌బాల్ ఆసియాకప్ పోటీల్లో భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు వరంగల్ జిల్లాకు చెందిన క్రీడాకారిణి వేల్పుల సాయివర్షిని ఎంపికైంది. చైనా వేదికగా అక్టోబర్ 12 నుండి 18వ తేదీ వరకు ఈ ఆసియాకప్ పోటీలు జరగనున్నట్లు హనుమకొండ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ తాబేటి రాజేందర్ వెల్లడించారు.

సాయివర్షిని భారత జట్టుకు ఎంపికైన సందర్భంగా వరంగల్ నగర పోలీస్ కమిషనర్ శ్వేతను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీ శ్వేత క్రీడాకారిణిని ప్రత్యేకంగా అభినందించి, ఆసియాకప్‌లో రాణించాలని ఆకాంక్షించారు. వరంగల్ క్రీడాకారిణి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడం గర్వకారణమని సీపీ కొనియాడారు. కుమార్తెను క్రీడల్లో ప్రోత్సహించిన తల్లిదండ్రుల కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి, కోచ్ పోలేపాక వినయ్, సాయివర్షిని తండ్రి అనిల్ మరియు అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# తిరువనంతపురంలో భారత్ తొలి ప్రాక్టీస్ సెషన్!



**ఆదివారం నుంచి ఇండో-విండీస్ వన్డే పోరు..**

**ప్రాక్టీస్‌లో చెమటోడ్చిన కోహ్లీ, రోహిత్!**

**శుభ్‌మన్ గిల్ సారథ్యంలో 15 మంది సభ్యుల టీమిండియా సన్నాహకాలు ప్రారంభం**

బలగం టీవీ, హైదరాబాద్

సొంతగడ్డపై వెస్టిండీస్‌తో జరగబోయే మూడు వన్డేల సిరీస్ కోసం టీమిండియా సమాయత్తమవుతోంది. సెప్టెంబర్ 27 (ఆదివారం) తిరువనంతపురం వేదికగా తొలి వన్డే జరగనుండగా, గురువారం నుంచి భారత జట్టు ఇక్కడ తొలి ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొంది. శుభ్‌మన్ గిల్ నాయకత్వంలోని 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టు మైదానంలో కఠిన సాధన ప్రారంభించింది.

సుదీర్ఘ విరామం తర్వాత టీమిండియా దిగ్గజ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టి నెట్స్‌లో తీవ్రంగా శ్రమించారు. ఇంగ్లండ్ పర్యటన తర్వాత ఈ ఇద్దరూ ఆడుతున్న తొలి వన్డే సిరీస్ ఇది. కోహ్లీ, రోహిత్ ఒకే నెట్‌లో కలిసి బ్యాటింగ్ సాధన చేయడం విశేషం. బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ వీరి ప్రాక్టీస్‌ను దగ్గరుండి పరిశీలిస్తూ రోహిత్ శర్మకు పలు సాంకేతిక సూచనలు చేశారు. నెట్ సెషన్‌కు ముందు ఆటగాళ్లు ఫుట్‌బాల్ ఆడుతూ కనిపించగా, ఆల్ రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి సుదీర్ఘంగా బౌలింగ్ సాధన చేశాడు.

2027 వన్డే ప్రపంచకప్‌ను లక్ష్యంగా పెట్టుకున్న రోహిత్, కోహ్లీ కేవలం వన్డే ఫార్మాట్‌పైనే దృష్టి సారించిన సంగతి తెలిసిందే. ఈ సిరీస్ ద్వారా తమ ఫామ్‌ను కొనసాగించాలని భావిస్తున్నారు.

భారత్ X వెస్టిండీస్ వన్డే సిరీస్ షెడ్యూల్:

తొలి వన్డే: సెప్టెంబర్ 27, తిరువనంతపురం (మధ్యాహ్నం 2:00 గంటలకు)

రెండో వన్డే: సెప్టెంబర్ 30, గువాహతి (మధ్యాహ్నం 2:00 గంటలకు)

మూడో వన్డే: అక్టోబర్ 3, న్యూ ఛండీఘడ్ (మధ్యాహ్నం 2:00 గంటలకు)

భారత వన్డే జట్టు:

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్, ధ్రువ్ జురెల్, నితీష్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, మహమ్మద్ సిరాజ్, అకిబ్ నబీ, యశస్వి జైస్వాల్, నమన్ ధీర్.

## ఆసియా గేమ్స్‌లో నేడు భారత పోటీల వివరాలు..

**షూటింగ్, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్‌లపై భారీ ఆశలు!**

**హాకీలో జపాన్‌తో మహిళల జట్టు పోరు; కబడ్డీ సెమీఫైనల్స్‌లో నేపాల్, థాయిలాండ్‌లతో భారత్ డిష్యుం డిష్యుం**

బలగం టీవీ, హైదరాబాద్

జపాన్‌లోని నగోయా వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడలు 2026లో శుక్రవారం (సెప్టెంబర్ 25) భారత క్రీడాకారులు భారీ సంఖ్యలో పలు కీలక విభాగాల్లో పోటీ పడనున్నారు. పతకాలే లక్ష్యంగా బరిలోకి దిగుతున్న భారత అథ్లెట్ల పూర్తి పోటీల షెడ్యూల్ (భారత కాలమానం ప్రకారం):

అథ్లెటిక్స్: మహిళల హెప్టాథ్లాన్ లాంగ్ జంప్‌లో అనామిక, పూజ (ఉదయం 6:30), జావెలెన్ త్రోలో అనామిక, పూజ (ఉదయం 7:55) పాల్గొంటారు. మహిళల షాట్‌పుట్ ఫైనల్లో మన్‌ప్రీత్ కౌర్, కృష్ణ మీనన్ (మధ్యాహ్నం 3:35), పురుషుల 100 మీటర్ల హీట్స్-2లో గుర్విందర్‌వీర్ సింగ్ (సాయంత్రం 4:11), హీట్స్-3లో అనిమేష్ కుజూర్ (సాయంత్రం 4:19) బరిలోకి దిగుతారు. మహిళల పోల్ వాల్ట్ ఫైనల్లో సింధుశ్రీ గణేష (సాయంత్రం 4:33) పోటీపడనున్నారు.

హాకీ & కబడ్డీ: మహిళల హాకీ విభాగంలో ఆతిథ్య జపాన్‌తో భారత జట్టు తలపడనుంది (ఉదయం 7:30). కబడ్డీ సెమీఫైనల్స్‌లో మహిళల జట్టు నేపాల్‌తో (ఉదయం 9:30), పురుషుల జట్టు థాయిలాండ్‌తో (ఉదయం 10:45) పోటీపడనున్నాయి.

షూటింగ్: 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్ టీమ్ అర్హత రౌండ్‌లో కమల్‌జీత్, సురుచి సింగ్ (ఉదయం 6:15) బరిలోకి దిగుతారు (ఫైనల్ ఉదయం 8:30). 50 మీటర్ల రైఫిల్ 3పీ పురుషుల విభాగంలో ఐశ్వర్ తోమర్, రుద్రాక్ష్ పాటిల్, నీరజ్ కుమార్‌లు అర్హత రౌండ్ మరియు టీమ్ ఫైనల్లో పాల్గొంటారు (ఉదయం 7:15, వ్యక్తిగత ఫైనల్ ఉదయం 10:30).

బ్యాడ్మింటన్: మిక్స్ డబుల్స్ ఆర్32లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో జోడీ (ఉదయం 6:10), పురుషుల డబుల్స్‌లో సాత్విక్‌సాయిరాజ్-చిరాగ్ శెట్టి (మధ్యాహ్నం 12:30), హరిహరన్-ఎంఆర్ అర్జున్ జోడీలు పోటీపడతాయి. మహిళల డబుల్స్‌లో త్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ మరియు కవిప్రియ-సిమ్రన్ జోడీలు (మధ్యాహ్నం 12:30), మహిళల సింగిల్స్‌లో ఉన్నతి హుడా బరిలోకి దిగనున్నారు.

బాక్సింగ్ & వెయిట్‌లిఫ్టింగ్: పురుషుల 60 కేజీల ఆర్16 రౌండ్‌లో సచిన్ (ఉదయం 10:15), మహిళల 54 కేజీల ఆర్16 రౌండ్‌లో ప్రీతి (మధ్యాహ్నం 2:15) పోటీపడతారు. మహిళల 61 కేజీల వెయిట్‌లిఫ్టింగ్ ఫైనల్లో నిరూపమా దేవి (మధ్యాహ్నం 1:30) పతకం కోసం పోరాడనున్నారు.

ఇతర విభాగాలు: ట్యూబులర్ ఈవెంట్లలో భాగంగా కానో స్ప్రింట్, టేబుల్ టెన్నిస్ (మిక్స్ డబుల్స్ సెమీస్ సాయంత్రం 3:00 నుంచి), స్క్వాష్ క్వార్టర్ ఫైనల్స్, ఈక్వెస్ట్రియన్, ఫెన్సింగ్, సర్ఫింగ్, స్విమ్మింగ్ మరియు ఈ-స్పోర్ట్స్ (పోకీమాన్ యునైట్ - భారత్ X సౌత్ కొరియా ఉదయం 7:55) పోటీలలో భారత అథ్లెట్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

# డర్బన్ వన్డేలో ఆసీస్‌ను చిత్తు చేసిన దక్షిణాఫ్రికా..

**సిరీస్‌లో 1-0 ఆధిక్యం!**

**సెంచరీతో చెలరేగిన మాథ్యూ బ్రీట్జె; ఆల్రౌండ్ ప్రదర్శనతో మెరిసిన మార్కో యాన్సెన్**

బలగం టీవీ, హైదరాబాద్

దక్షిణాఫ్రికా పర్యటనను ఆస్ట్రేలియా పరాజయంతో ప్రారంభించింది. డర్బన్ వేదికగా గురువారం జరిగిన తొలి వన్డేలో ఆతిథ్య దక్షిణాఫ్రికా జట్టు 67 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించి, మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది.

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 297 పరుగుల భారీ స్కోరు చేసింది. సఫారీ ఓపెనర్ మాథ్యూ బ్రీట్జె (112) అద్భుత శతకంతో జట్టుకు బలమైన పునాది వేయగా, చివర్లో ఆల్ రౌండర్ మార్కో యాన్సెన్ (75) మెరుపు ఇన్నింగ్స్ ఆడి జట్టు స్కోరును 300 పరుగుల సమీపానికి చేర్చాడు.

అనంతరం 298 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా 41.2 ఓవర్లలో 230 పరుగులకే పరిమితమై ఆలౌట్ అయింది. కంగారూ జట్టులో కెప్టెన్ మిచెల్ మార్ష్ (60), మాథ్యూ రెన్‌షా (44) పోరాడినప్పటికీ జట్టును విజయతీరాలకు చేర్చలేకపోయారు. సౌతాఫ్రికా బౌలర్లు కచ్చితత్వంతో బౌలింగ్ చేసి ఆసీస్ బ్యాటింగ్ ఆర్డర్‌ను దెబ్బతీశారు.






## ఆస్ట్రేలియా-ఏ ముందు 363 పరుగుల భారీ లక్ష్యం..

**మూడో రోజు ముగిసేసరికి 55/2!**

**దేవ్‌దత్ పడిక్కల్ అర్ధశతకం, తోడ్ మర్ఫీకి 4 వికెట్లు;**

**కంగారూలకు విజయం సమీపంలో సవాలు**

బలగం టీవీ, పుదుచ్చేరి

ఆస్ట్రేలియా-ఏ జట్టుతో ఇక్కడ జరుగుతున్న తొలి నాలుగు రోజుల అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో ఇండియా-ఏ విజయం సాధించే దిశగా అడుగులు వేస్తోంది. మ్యాచ్ మూడో రోజు (గురువారం) ఇండియా-ఏ రెండో ఇన్నింగ్స్‌లో 199 పరుగులకే ఆలౌట్ అయినప్పటికీ, తొలి ఇన్నింగ్స్ లభించిన 163 పరుగుల ఆధిక్యంతో కలిపి సందర్శక ఆస్ట్రేలియా-ఏ జట్టు ముందు 363 పరుగుల దుర్భేద్యమైన లక్ష్యాన్ని నిర్దేశించింది.

అనంతరం భారీ లక్ష్య ఛేదనలో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా-ఏ, మూడో రోజు ఆట ముగిసే సమయానికి 23 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 55 పరుగులు చేసింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా గెలుపొందాలంటే మరో 308 పరుగులు చేయాల్సి ఉండగా, మ్యాచ్‌ను కాపాడుకోవడానికి చివరి రోజు రోజంతా బ్యాటింగ్ చేయాల్సి ఉంటుంది.

మ్యాచ్ ముఖ్యాంశాలు:

ఇండియా-ఏ తన రెండో ఇన్నింగ్స్‌లో ఒక దశలో 93/1తో దృఢమైన స్థితిలో ఉన్నప్పటికీ, ఆ తర్వాత వరుసగా వికెట్లు కోల్పోయి కుప్పకూలింది. కెప్టెన్ దేవ్‌దత్ పడిక్కల్ (59 పరుగులు, 88 బంతుల్లో 7 ఫోర్లు) బాధ్యతాయుతమైన అర్ధశతకంతో రాణించగా, ఓపెనర్ సాయి సుదర్శన్ (39 పరుగులు) మరియు వికెట్ కీపర్ బ్యాటర్ కుమార్ కుషాగ్ర (46 నాటౌట్) కీలక పరుగులు జోడించారు. పడిక్కల్ వికెట్ పడిన తర్వాత భారత్ చివరి 6 వికెట్లను కేవలం 48 పరుగుల వ్యవధిలోనే కోల్పోయింది. ఆస్ట్రేలియా బౌలర్లలో ఆఫ్ స్పిన్నర్ తోడ్ మర్ఫీ 48 పరుగులిచ్చి 4 వికెట్లతో చెలరేగగా, లియామ్ స్కాట్ మరియు బ్రెండన్ డాగెట్ చెరో రెండు వికెట్లు తీశారు.

సొంతగడ్డపై తిరుగులేని స్పిన్ దాడితో ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టిన ఇండియా-ఏ, మ్యాచ్ చివరి రోజున ఎనిమిది వికెట్లు పడగొట్టి విజయాన్ని సొంతం చేసుకోవాలని పట్టుదలతో ఉంది.

స్కోరు వివరాలు:

ఇండియా-ఏ (తొలి ఇన్నింగ్స్): 334 ఆలౌట్

ఆస్ట్రేలియా-ఏ (తొలి ఇన్నింగ్స్): 171 ఆలౌట్

ఇండియా-ఏ (రెండో ఇన్నింగ్స్): 57.4 ఓవర్లలో 199 ఆలౌట్ (దేవ్‌దత్ పడిక్కల్ 59, కుమార్ కుషాగ్ర 46 నాటౌట్, సాయి సుదర్శన్ 39; తోడ్ మర్ఫీ 4/48, లియామ్ స్కాట్ 2/22, బ్రెండన్ డాగెట్ 2/21)

ఆస్ట్రేలియా-ఏ (రెండో ఇన్నింగ్స్ - మూడో రోజు ముగిసేసరికి): 23 ఓవర్లలో 55/2 (విజయానికి ఇంకా 308 పరుగులు కావాలి)

# దిల్ ప్రీత్ సింగ్ హ్యాట్రిక్ గోల్స్..



**ఆసియా గేమ్స్ చరిత్రలోనే రికార్డు విజయం!**

**పూల్-ఏలో అగ్రసానానికి ఇండియా; శనివారం జపాన్‌తో తదుపరి పోరు**

బలగం టీవీ, హైదరాబాద్

ఆసియా క్రీడల హాకీ పోటీల్లో భారత పురుషుల జట్టు విజయపరంపర కొనసాగుతోంది. పూల్-ఏలో భాగంగా దక్షిణ కొరియాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 8-2 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించి పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఆసియా గేమ్స్ చరిత్రలోనే దక్షిణ కొరియాపై భారత్‌కు ఇది అతిపెద్ద రికార్డు విజయం కావడం విశేషం.

ఈ మ్యాచ్‌లో భారత యువ స్ట్రైకర్ దిల్ ప్రీత్ సింగ్ హ్యాట్రిక్ గోల్స్‌తో విజయంలో కీలక పాత్ర పోషించాడు. దిల్ ప్రీత్‌తో పాటు అభిషేక్, శిలానంద్ లక్రా, సుఖ్‌జీత్ సింగ్, హర్మన్‌ప్రీత్ సింగ్, రాజిందర్ సింగ్ కూడా చెరో గోల్ చేసి కొరియా డిఫెన్స్‌ను దెబ్బతీశారు. ఆరంభం నుంచే దాడి తీవ్రతరం చేసిన భారత్, ప్రత్యర్థికి ఎటువంటి కోలుకునే అవకాశం ఇవ్వకుండా లీడ్ సాధించింది.

ఈ ఘన విజయంతో భారత్ గ్రూప్-ఏ స్టాండింగ్స్‌లో అగ్రస్థానానికి చేరుకుంది. భారత జట్టు తన తదుపరి మ్యాచ్‌లో శనివారం ఆతిథ్య జపాన్‌తో తలపడనుంది.

# చైనీస్ తైపీ, జపాన్‌లపై భారత్ ఘన విజయాలు..

**గ్రూప్-ఏ టాప్‌తో భారత్ సెమీస్‌కు దూకుడు!**

**కబడ్డీలో పతకం ఖాయం చేసిన టీమిండియా;**

**అజేయంగా నాకౌట్‌లోకి అడుగు**

బలగం టీవీ, హైదరాబాద్






ఆసియా క్రీడలు 2026 కబడ్డీ పోటీల్లో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ అజేయ జైత్రయాత్రను కొనసాగిస్తోంది. గ్రూప్-ఏలో జరిగిన తమ చివరి లీగ్ మ్యాచ్‌లలో భారత పురుషుల, మహిళల జట్లు ఘనవిజయాలు సాధించి గ్రూప్ టాప్‌గా సెమీఫైనల్స్‌లోకి ప్రవేశించాయి. దీంతో భారత్‌కు కనీసం రెండు కాంస్య పతకాలు ఖాయమయ్యాయి.

గురువారం జరిగిన పురుషుల గ్రూప్-ఏ చివరి మ్యాచ్‌లో భారత జట్టు 37-21 తేడాతో చైనీస్ తైపీని చిత్తు చేసింది. తొలి సగం ముగిసేసరికి 23-11 ఆధిక్యంలో నిలిచిన భారత్, రెండో సగంలోనూ (14-10) అదే ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. రైడింగ్‌ల ద్వారా 28 పాయింట్లు, 3 బోనస్ పాయింట్లు, ప్రత్యర్థిని ఆలౌట్ చేయడం ద్వారా 6 పాయింట్లు సాధించింది. లీగ్ దశలో వరుసగా దక్షిణ కొరియా, జపాన్, బంగ్లాదేశ్, చైనీస్ తైపీలపై నెగ్గి భారత్ వరుసగా నాలుగో విజయాన్ని నమోదు చేసింది.

మరొకవైపు, మహిళల గ్రూప్-ఏ మ్యాచ్‌లో భారత జట్టు 50-25 గోల్స్/పాయింట్ల తేడాతో ఆతిథ్య జపాన్‌ను ఘోరంగా ఓడించింది. మ్యాచ్ ప్రారంభం నుంచే పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన భారత మహిళలు తొలి సగానికే 32-13తో తిరుగులేని ఆధిక్యాన్ని సాధించి, రెండో సగంలో మరో 18 పాయింట్లు జోడించారు. భారత జట్టు మొత్తం 37 అవుట్ పాయింట్లు, 7 బోనస్ పాయింట్లు, 6 ఆలౌట్ పాయింట్లతో మ్యాచ్‌ను ఏకపక్షంగా ముగించింది. ఇరాన్, బంగ్లాదేశ్‌లపై ఇప్పటికే గెలిచిన భారత మహిళల జట్టు గ్రూప్‌లో అగ్రస్థానంతో సెమీస్ చేరింది.

శుక్రవారం (సెప్టెంబర్ 25) జరగనున్న సెమీఫైనల్స్‌లో భారత పురుషులు, మహిళల జట్లు తదుపరి సమరానికి సిద్ధమయ్యాయి.

## మా ఇద్దరి లక్ష్యం భారత క్రికెట్ అభ్యున్నతే..

బలగం టీవీ, హైదరాబాద్

టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మతో తనకు ఉన్న బంధం ఈ రోజు కొత్తగా ఏర్పడింది కాదని, తామిద్దరి మధ్య సుదీర్ఘ కాలంగా బలమైన రిలేషన్ ఉందంటూ భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ స్పష్టం చేశారు. తమ మధ్య విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని ఆయన కొట్టిపారేశారు. జియోహాట్‌స్టార్‌కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో గంభీర్ రోహిత్ శర్మతో తన స్నేహం మరియు అనుబంధం గురించి మాట్లాడారు.

గంభీర్ ఇంటర్వ్యూలోని ప్రధాన ముఖ్యాంశాలు:

రోహిత్ శర్మ భారత జట్టులోకి అడుగుపెట్టిన సమయంలో తాను సీనియర్ ఆటగాడిగా ఉన్నానని, నాటి నుంచే తమ మధ్య స్నేహం మొదలైందని గంభీర్ గుర్తు చేసుకున్నారు. తాము కలిసి అనేక మ్యాచ్‌లు ఆడామని, కాబట్టి విదేశాల నుండి వచ్చిన నూతన కోచ్‌లాగా రోహిత్ మైండ్ సెట్ లేదా వ్యక్తిత్వాన్ని తాను ప్రత్యేకంగా అర్థం చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఒక్కోసారి కోచ్, కెప్టెన్ల మధ్య విభిన్న అభిప్రాయాలు రావడం సహజమేనని, అయితే అంతిమంగా జట్టు శ్రేయస్సుకు ఏది మంచిదో దాన్నే ఏకగ్రీవంగా అమలు చేస్తామని తెలిపారు. ఇప్పటివరకు తాను పనిచేసిన నలుగురు కెప్టెన్ల (రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్) ప్రధాన లక్ష్యం భారత క్రికెట్‌ను తదుపరి స్థాయికి తీసుకెళ్లడమేనని గంభీర్ పునరుద్ఘాటించారు. గంభీర్ చేసిన ఈ వ్యాఖ్యలు రోహిత్, కోహ్లీలు రాబోయే 2027 వన్డే ప్రపంచకప్ వరకు జట్టులో కొనసాగుతారనే సంకేతాలను ఇస్తున్నాయి.